J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 45 సంచిక : 45 10.4.2026, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

# విజయమంత్రం.. వ్యూహకర్తల తంత్రం

- ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో స్ట్రాటజిస్టుల హవా
- రాజకీయ తెరపై స్క్రీన్‌ప్లే, డైరెక్షన్ వారిదే
- నాయకులని నడిపించే మాస్టర్ మైండ్‌లు వాళ్ళే
- 'కింగ్‌మేకర్'ల చేతిలో రాష్ట్రాల భవిష్యత్తు

విద్య, వైద్యం, రియల్ ఎస్టేట్, హోటల్, ఆతిథ్య రంగాలతో పాటు పలు వ్యాపార పారిశ్రామిక రంగాలలో సైతం ఇప్పటికే కార్పొరేట్లు తమ హవా కొనసాగిస్తున్నారు. అతిథులను ఆకట్టుకోవడం, ఖాతాదారులను ఆకర్షించడం, వాటాదారులను సంతృప్తిపరచడం కోసం ఎప్పటికప్పుడు వ్యూహాలు రచించి, ఆదాయాన్ని వృద్ధి చేసుకోవడం, ఆయా కంపెనీలకు లాభాలు తీసుకురావడం కన్సల్టెంట్లు, స్ట్రాటజిస్టులు, అనలిస్టుల ప్రధాన బాధ్యత. రిటైల్ రంగంలో అమ్మకాలు పెరిగేలా చేయడం, పరిశ్రమలలో ఉత్పత్తులను పెంచడం, విద్యాసంస్థలలో అడ్మిషన్ల సంఖ్యని పెంచడం, వైద్యాలయాలలో పేషంట్లని ఆకర్షించడం వంటివి వ్యూహకర్తలు విధులు.

అయితే ప్రజలతో నేరుగా సంబంధం ఉండే రాజకీయ రంగంలో జనం ఆకాంక్షలని, ఆలోచనలని తెలుసుకుని వారి మనసులని గెలుచుకుని, నాయకులపై వారికి వున్న అభిమానాన్ని ఓట్లుగా మలచడం అంత తేలికైన విషయం కాదు. అయితే పక్కా ప్రణాళిక, ముందుచూపు ఉంటే తిమ్మిని బమ్మిని చేసి ప్రజాక్షేత్రంలోనూ విజయబావుట ఎగరేయడం పెద్ద విషయం కాదని ఈ మధ్య కాలంలో పొలిటికల్ స్ట్రాటజిస్టులు నిరూపిస్తున్నారు.

2లో



ప్రశాంత్ కిషోర్ శబరీశన్ సునీల్ కనుగోలు రాబిన్ శర్మ

## అనితరసాధ్యునికి అపురూప సత్కారం..

# మన వరప్రసాద్‌రెడ్డికి మరో డాక్టరేట్ పురస్కారం

- తాను చదువుకున్న కాకినాడ కళాశాల నుంచే స్వీకారం

పద్మభూషణులు, భారతీయ వైద్య ఆరోగ్యరంగంలోనే హెపటైటిస్-బీ వ్యాక్సిన్ తయారీకి ఆద్యులు, శాంతా బయోటెక్నిక్స్ వ్యవస్థాపకులు, అన్నిటికీమించి మన నెల్లూరీయులు డాక్టర్ కే.ఐ.వరప్రసాద్‌రెడ్డికి ఇటీవల కాకినాడ కాలేజీ నుంచి 'గౌరవ డాక్టరేట్' లభించింది. అత్యంత ప్రతిష్టాత్మకమైన "పద్మభూషణ్" సహా ఇప్పటికే అనేక పురస్కారాలు, మూడుసార్లు డాక్టరేట్లు అందుకున్న ఆయనకి ఇది నాల్గవ డాక్టరేట్.



ఆయన ప్రతిభాపాటవాలకి, సమాజానికి ఆయన అందిస్తున్న మానవీయ సేవలకి ఇది మరో నిదర్శనం. ఈసారి తాను చదువుకున్న జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్శిటీ, కాకినాడ(జెఎన్‌టీయు) నుండే డాక్టరేట్ అందుకోవడం విశేషం. గతంలో తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, విశాఖలోని గీతం యూనివర్శిటీ, తెనాలిలోని విజ్ఞాన్ యూనివర్శిటీల నుండి ఆయన డాక్టరేట్‌లు అందుకున్నారు. 2005లో కేంద్రప్రభుత్వం నుంచి 'పద్మభూషణ్' బిరుదును కూడా పొందారు. తాజాగా ఏప్రిల్ 2న జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్శిటీ, కాకినాడ 12వ స్నాతకోత్సవంలో ఆయన ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతులమీదుగా ఈ డాక్టరేట్‌ను అందుకున్నారు. 'ఢిల్లీకి రాజైనా..తల్లికి బిడ్డే' అన్నట్లుగా, సొంత కళాశాల నుంచే డాక్టరేట్‌ను స్వీకరించడం తనకెంతో ఆనందంగా, అపురూపంగా ఉందని ఆయన ఈ సందర్భంగా ఉప్పొంగిపోయారు.

2లో

## స్మృత్యంజలి



వల్లూరు బోయన నాయుడు - లక్ష్మీనరసమ్మ
తాత - అమ్మమ్మ



వల్లూరు నాగభూషణం - మధుసూదనమ్మ
బావ - అక్క





వల్లూరు సుందరరాజం వల్లూరు వెంకట కృష్ణయ్య
మేనమామలు



నిర్యాణము : 10.04.2003



నిడిగంటి చంద్రశేఖరం
అన్న

మా అమ్మ శ్రీమతి నిడిగంటి లక్ష్మీకాంతమ్మ గారు జన్మించింది నెల్లూరుజిల్లా బ్రహ్మదేవం గ్రామం.
శ్రీ వల్లూరు బోయన నాయుడు గారికి మా అమ్మ మూడవ సంతానం. మా తాత గారిది సామాన్య రైతు కుటుంబం.
అల్లారుముద్దుగా పెంచినా కూడా మా తాతగారు ఆమెకి విద్యాబుద్ధులు చెప్పించారు.
ఆరోజుల్లో పల్లెలో సరైన విద్యావసతులుండేవి కావు. మా అమ్మ శ్రీమతి లక్ష్మీకాంతమ్మ గారు పట్టుదలతో
తన సమకాలీకులలో అందరికంటే పెద్ద చదువులు చదవగలిగానని చెప్పేది.
నాకు ఊహ తెలిసే సమయానికి ప్రస్తుత తిరుపతి జిల్లా ఆరూరు గ్రామ వాస్తవ్యులు,
మా నాన్న గారైన శ్రీ నిడిగంటి సిద్దయ్య నాయుడు గారు నెల్లూరుజిల్లాలో ఫారెస్ట్ డిపార్టుమెంటులో పని చేసేవారు.
విధి వక్రించడంతో నాకు ఏడేళ్ళు వచ్చేసరికి మా నాన్న శ్రీ సిద్దయ్యనాయుడు గారు దైవసాన్నిధ్యము చేరినారు.
చదువు విలువ తెలిసి ఉండడంతో కష్టాలకు వెరవక మా తండ్రి లేని లోటును తెలియనీయకుండా
మేనమామలు మా అక్క, మా అన్నల సహకారముతో నన్ను ఉన్నత చదువులు చదివించారు.
నేను ప్రస్తుతము సుఖ జీవనము సాగిస్తూ ఈ స్థాయిలో ఉండడానికి కారణభూతురాలైన
మా అమ్మ శ్రీమతి నిడిగంటి లక్ష్మీకాంతమ్మ గారు
భువి నుండి దివికేగి నేటికి ఇరవై మూడు సంవత్సరాలు పూర్తయిన సందర్భముగా
నా మాతృమూర్తికి స్మృత్యంజలి ఘటిస్తున్నాను.

ఇట్లు : శ్రీమతి & శ్రీ నిడిగంటి గోవర్ధనరావు
విశ్రాంత అధికారి, వాణిజ్య పన్నుల శాఖ, నెల్లూరు.
చాప్టర్ వైస్ ప్రెసిడెంట్ - 2025/2026, శాక్రమెంటో CA, శంకర నేత్రాలయ, U.S.A
బృంద సభ్యుడు, తెలుగు సాహిత్య వేదిక, నెల నెలా తెలుగు వెన్నెల,
ఉత్తర టెక్సాస్ తెలుగు సంఘం TANTEX, డల్లాస్ ఫోర్ట్‌వర్త్, యు.ఎస్.ఏ

# మరో డాక్టరేట్

(మొదటిపేజీ తరువాయి)

వరప్రసాద్‌రెడ్డి వ్యక్తి కాదు, అపూర్వ ప్రతిభాశక్తి. ఆయన కేవలం పేరెన్నికగన్న పారిశ్రామిక దిగ్గజమే కాక, సాహిత్యంలోనూ నిష్ణాతులు. అంతేకాదు, ఆధ్యాత్మిక సేవాతత్పరులు, అపర దానకర్ణులు కూడా. ప్రఖ్యాత ప్రవచనకర్త చాగంటి కోటేశ్వర రావుకు ఆయన శిష్యులు. అంతేకాదు, తానెంతగా ఎదిగినా ఒదిగి ఉండే సౌజన్యశీలి. సహృదయులు. నేటికీ అలుపెరగకుండా సమాజంలో తనవంతు బాధ్యతలను నిర్వర్తిస్తూ సామాజికంగా ఆధ్యాత్మికంగా ఎన్నో గొప్ప కార్యక్రమాలని నిర్వర్తిస్తూ, ఎందరికో మార్గదర్శకమవుతున్నారు. అందుకే, ఆయనకు చదువు చెప్పిన ఆ కాలేజీయే ఆయనకు డాక్టరేట్‌ను బహుకరించి 'శెభాష్' అంటూ తన పూర్వ విద్యార్థిని దీవించింది.

కోడూరు ఈశ్వర వరప్రసాద్‌రెడ్డిది ఓ చిన్న పల్లెటూరు. నెల్లూరుజిల్లా తోటపల్లి గూడూరు మండలంలోని పాపిరెడ్డిపాళెం అనే గ్రామం ఆయన స్వస్థలం. తల్లితండ్రులు దివంగత కోడూరు వెంకటరమణారెడ్డి-శాంతమ్మ దంపతులకు ఆయన గారాల తనయునిగా జన్మించారు. సాక్షాత్తూ ఆ పరమేశ్వరుడి వరప్రసాదంగా జన్మించిన ఆ బిడ్డను తల్లితండ్రులు 'ఈశ్వర వరప్రసాదం' అని భావిస్తూ, ఆ పేరునే ఆయనకు పెట్టారు. అదే ఆయనకు వరమైంది. జీవితంలో ఎన్ని కష్టనష్టాలొచ్చినా ఆత్మస్థైర్యంతో అధిగమిస్తూ, అంచలంచెలుగా తన విజయప్రస్థానాన్ని కొనసాగించారు. పుట్టింది చిన్న ఊరిలోనే అయినా ఆ ఊరికే గొప్ప పేరు తెచ్చారు.

### కృషి, పట్టుదలతోనే.. సమున్నత శిఖరాలు..!

చిన్నతనం నుంచి ఆయనకు విద్యపై మక్కువ ఎక్కువ. పలకా బలపం పట్టుకుని బడిబాటలో భాగంగా తమ ఊరికి దగ్గరగా ఉన్న పెద్దచెరుకూరు బడిలో ఓనమాలు చదువుకుని, ఆ తర్వాత నెల్లూరుకు వచ్చి విఆర్ కళాశాలలో ఇంటర్ చదివారు. అనంతరం బియస్సి పూర్తి చేసి, కాకినాడ జెయన్‌టియులో ఇంజనీరింగ్ ఎలక్ట్రానిక్స్‌లో చేరారు. అంతకు ముందు 3 సంవత్సరాలు బియస్సి, యంపిసి విద్యార్థి కావడంతో నేరుగా ఇంజనీరింగ్ 3వ సంవత్సరంలోకి ప్రవేశించారు. ఆ దశలో కాకినాడ కాలేజీ ఆయనకు ఎన్నో అనుభవాలను ఇచ్చింది. స్నేహభావపు పరిమళాలను అద్దింది. తరగతి గది పాఠాలకే కాకుండా ఆ తర్వాత అనేక జీవిత పాఠాలకి కాకినాడ కళాశాలే స్ఫూర్తిగా నిలిచింది. కాకినాడ కాలేజీ చదువు తరువాత ఆయన జీవితం అనేక మలుపులు తిరిగింది.

1971లో జర్మనీకి వెళ్లి కంప్యూటర్ సైన్స్‌లో పోస్ట్‌డిప్లొమా చేశారు. అనంతరం ఉద్యోగ నిమిత్తం అమెరికాకు వెళ్లి, ఆరునెలలు అక్కడ ఉద్యోగం చేసి స్వదేశానికి తిరిగి వచ్చి డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్ రీసెర్చ్ లాబరేటరీలో రీసెర్చ్ సైంటిస్టుగా చేరారు. 1985లో ఆ ఉద్యోగాన్ని కూడా వదిలేసి, మళ్లీ అమెరికా వెళ్లి, ఆ తర్వాతికాలంలో ప్రాణాంతకమైన హెపటైటిస్-బీ వ్యాక్సిన్ కనుగొని భారతదేశానికే గర్వకారణమయ్యారు. ప్రపంచాన్ని వణికిస్తున్న హెపటైటిస్-బిని నిరోధించే "షాన్‌వాక్-బి" వాక్సిన్ 1997 ఆగస్టు 18వ తేదీన అందుబాటులోకి రావడంతో ఆయన పేరు ప్రపంచమంతా మార్మోగిపోయింది. నిరంతర కృషి, పట్టుదల, క్రమశిక్షణ, అంకిత భావం, కార్యదీక్షా దక్షతలతో ఆయన తన ప్రస్థానాన్ని కొనసాగించారు.

### కొత్త ఆలోచనలతోనే సరికొత్త ఆవిష్కరణలు పుడతాయి

- వరప్రసాద్‌రెడ్డి

విద్యార్థులు కొత్త ఆలోచనలతో సరికొత్త ఆవిష్కరణలు చేయాలని, కేవలం పాఠ్యాంశాల జ్ఞానంతోనే కాకుండా, వాటిని పురోభివృద్ధికి అన్వయించగల సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. తాను డాక్టరేట్ అందుకున్న సందర్భంగా వరప్రసాద్‌రెడ్డి స్పందిస్తూ జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ విద్యార్థినీ విద్యార్థులని ఉద్దేశించి ప్రసంగించారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో భవిష్యత్ అవసరాలను ముందుగానే గుర్తించి, యువతీ యువకులకు ఆయా శాఖల్లో తర్ఫీదునిచ్చేందుకు కాకినాడ కాలేజీ అగ్రగామిగా ఉండాలన్నదే తన ఆకాంక్ష అని స్పష్టం చేశారు. పరిశోధన ఆధారిత స్టార్టప్‌లు స్థాపించి ఉద్యోగాలను సృష్టించే వారిగా ఎదగాలని ఆయన విద్యార్థినీ విద్యార్థులకు మార్గదర్శనం చేశారు. అందుకు ప్రోత్సాహంగా జెఎన్‌టీయు ఎన్‌టర్ ప్రెన్యూర్‌షిప్ ప్రోగ్రామ్‌కి తన వంతుగా కోటి రూపాయల విరాళాన్ని ప్రకటించారు. తనకు చదువులు చెప్పి ఇంతటి వాడిగా తీర్చిదిద్దిన తమ గురువులందరినీ గుర్తు చేసుకున్నారు. తనకు డాక్టరేట్ ఇచ్చి గౌరవించినందుకు తన కృతజ్ఞతలు తెలిపారు.

ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొంది నెల్లూరు జిల్లాకే గర్వకారణంగా ఎదిగిన డాక్టర్. వరప్రసాద్‌రెడ్డికి లాయర్ అభినందనలు...!

# కార్మికుల హక్కులను కాలరాస్తున్నారు

- ప్రభుత్వాల తీరుపై ఏఐటీయుసి నేతల ఆందోళన

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయంటూ ఏఐటీయుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య ఆందోళన వ్యక్తం చేశారు. నెల్లూరులోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఈనెల 8న జరిగిన ఏఐటీయుసి 15వ జిల్లా మహాసభలో ఆయన మాట్లాడుతూ, గతంలో ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దుచేసి, నాలుగు లేబర్‌కోడ్‌లుగా అమలుచేయడం దారుణ మన్నారు. దీంతో కార్మికులు నానా అవస్థలు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సభలో ఏఐటీయుసి నాయకులు సిహెచ్ రామారావు, రాష్ట్ర మునిసిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి సుబ్బరాయుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి, శశికుమార్, మధు, ప్రభాకర్, మాలకొండయ్య, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# విజయమంత్రం.. వ్యూహకర్తల తంత్రం

(మొదటిపేజీ తరువాయి)

దీంతో ఢిల్లీ నుంచి గల్లీ వరకు జాతీయ పార్టీల నుంచి ప్రాంతీయ, ఉప ప్రాంతీయ పార్టీల దాకా వ్యూహకర్తలను నియమించుకుంటూ విజయం కోసం పోరాడుతున్నారు. తాజాగా జరుగుతున్న ఐదురాష్ట్రాల ఎన్నికల్లోనూ ఈ ఈవెంట్ మేనేజర్లు తమదైన పాత్ర పోషిస్తూ రాజకీయ రణరంగాన్ని రక్తికట్టిస్తున్నారు.

### రాజకీయ చదరంగంలో కార్పొరేట్ల వ్యూహం!

రాజకీయ నాయకులు ఎలా ఉండాలో, ఏఏ అంశాలపై ఏవిధంగా స్పందించాలో, ఎలా నడవాలో, హావభావాలను ఎలా పలికించాలో, సెంటిమెంట్‌లను ఎలా రెచ్చగొట్టాలో, ఏఏ అంశాన్ని ఎప్పుడు ప్రస్తావించాలో ఇట్టే చెప్పేస్తారు. బూత్‌లెవల్ నుంచి వ్యూహం రూపొందించి సర్వేలు, ర్యాలీలు, ప్రచార సరళితో పాటు మ్యానిఫెస్టో రూపకల్పన వరకు అన్నీ తామై నడిపిస్తారు. సమీకరణలను బట్టి ఆయా ప్రాంతాల్లో పార్టీల బలాబలాలను అనుసరించి నాయకుడు ఏ సభలో ఎంతసేపు ప్రసంగించాలి, ఏ అంశాలను తన స్పీచ్‌లో ప్రస్తావించాలో ఈ ఈవెంట్ మేనేజర్లే నిర్ణయిస్తారు. సామాజిక మాధ్యమాలలో కార్యకర్తలు ఎలా స్పందించాలి ఏ అంశాలను ఫోకస్ చేయాలి, వేటిని రిపీటెడ్‌గా ట్రోల్ చేయాలి, ఏ విషయాలపై సోషల్ మీడియాలో హల్‌చల్ చేయాలో సూచిస్తారు. క్యాస్ట్ ఈక్వేషన్స్, ప్రాంతీయ సమస్యలు సర్వేలను అనుసరించి ఎప్పటికప్పుడు రాజకీయ వ్యూహాలను మార్చేస్తుంటారు. వారే ప్రస్తుతం దేశంలో పొలిటికల్ గురూలుగా ప్రసిద్ధి చెందుతున్న స్ట్రాటజిస్టులు. వీరు వెంటుంటే గెలుపు నల్లేరుపై నడకే అని నాయకులు నమ్ముతున్నారు. అందుకే కోట్లాది రూపాయలు వెచ్చించి వ్యూహకర్తలను నియమించుకుంటూ గెలుపే ధ్యేయంగా ముందుకు కదులుతున్నారు.

### దేశంలో ఇప్పటికే చాలాచోట్ల...!

దేశంలో పొలిటికల్ స్ట్రాటజిస్టుల ప్రభావం, ప్రాధాన్యత గత దశాబ్దకాలంగా కొనసాగుతోంది. 2014లో మోదీ నేతృత్వం లోని బీజేపీ గెలుపులో రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ కీలక పాత్ర పోషించారు. దీంతో ఆయన పేరు దేశవ్యాప్తంగా మారుమోగింది. తర్వాత బెంగాల్‌లో మమతాబెనర్జీ, ఢిల్లీలో ఆమ్‌ఆద్మీ పార్టీ అధినేత కేజ్రీవాల్ హ్యాట్రిక్ గెలుపు వెనుక, ఆంధ్రాలో జగన్, తమిళనాడులో స్టాలిన్ విజయానికి పీకే మార్కు చాణిక్యం ప్రధాన కారణమైంది. దీంతో దేశ వ్యాప్తంగా ప్రశాంత్ కిషోర్ నేతృత్వంలోని (ఇండియన్ పొలిటికల్ యాక్షన్ కమిటీ) ఐప్యాక్‌కు డిమాండ్ ఏర్పడింది. ఇదే కోవలో నేషన్ విత్ నమో, వారాహే అనలిస్టిక్స్, డిజైన్ బాక్స్‌డ్ వంటి రాజకీయ వ్యూహాలను రచించే సంస్థలు పుట్టుకొచ్చాయి. దేశంలో వెయ్యికి పైగా ఉన్న పార్టీలకు ఈ సంస్థలు ప్రస్తుతం చాలడం లేదంటే అతిశయోక్తి కాదేమో. ఎందుకంటే దీనికి ప్రధాన కారణం ఒక్కోసారి రాష్ట్రాల పరిస్థితులను బట్టి ప్రత్యర్థి పార్టీలకు సైతం ఒకే వ్యూహకర్త, సంస్థ సేవలందిస్తుండడమే.

### పంచతంత్రంలోనూ ప్రధాన పాత్రే...!

దేశంలో ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారిన ఐదురాష్ట్రాల ఎన్నికల్లోనూ స్ట్రాటజిస్టుల హవా కొనసాగుతోంది. పెద్దరాష్ట్రాలైన బెంగాల్, తమిళనాడు, కేరళతో పాటూ అస్సాం, పుదుచ్చేరి వంటి రాష్ట్రాల్లోనూ వ్యూహకర్తలు తమ ఉనికి చాటుతున్నారు. మన పక్కనున్న తమిళనాడు రాష్ట్రాన్ని తీసుకుంటే, అక్కడ స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే, పళనిస్వామి నేతృత్వంలోని అన్నాడీఎంకే, విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీలకు సంబంధించిన మూడు కూటముల మధ్య హోరాహోరీ పోరు సాగుతోంది. దీంతో ఎలాగైనా ప్రజా యుద్ధంలో గెలవడం కోసం అధికార డీఎంకే మొత్తం ఎనిమిదిసంస్థలని తమ గెలుపుకోసం వినియోగించుకుం టోంది. వీరిలో షోటైమ్ కన్సల్టెన్సీకి చెందిన రాబిన్‌శర్మ, ఐప్యాక్, డి.యం.కే అనుబంధ సంస్థ పెన్ స్టూడియో అధినేత శబరీశన్, మైండ్ షేర్ అనలిటిక్స్ సునీల్ కనుగోలు వంటి నాలుగు సంస్థల ప్రతినిధులని తమ పూర్తిస్థాయి వ్యూహకర్తలుగా నియమించుకుంది.

ఈ సంస్థలన్నీ ద్రవిడ మోడల్ పాలనలో డీఎంకే ప్రభుత్వం సాధించిన విజయాలు, తమిళులపై బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం చూపిస్తున్న వివక్ష, ఢిల్లీ వర్సెస్ తమిళం వంటి అంశా లను ప్రధానాస్త్రాలుగా చేసి స్టాలిన్‌ను మరోసారి గద్దెనెక్కించే దుకు శాయశక్తులా ప్రయత్నిస్తున్నాయి. ఇక ప్రధాన ప్రతిపక్షమైన అన్నాడీఎంకే ప్రామాణ్య స్ట్రాటజీ కన్సల్టెన్సీ సంస్థతో ఒప్పందం చేసుకుని డీఎంకే మంత్రుల అవినీతి, ప్రభుత్వ పథకాల్లో చోటు చేసుకుంటున్న కుంభకోణాలు, కరుణానిధి, స్టాలిన్, ఉదయనిధి కుటుంబపాలన వంటి అంశాలపై ఫోకస్ చేస్తూ ప్రజలను తమవైపు తిప్పుకునేందుకు యత్నిస్తోంది. ఇక ప్రముఖ సినీనటుడు విజయ్ స్థాపించిన టీవీకే పార్టీ ఆదవ్‌అర్జున్ అనే వ్యూహకర్తని నియమించుకుని 'ఒక్కచాన్స్' నినాదంతో ఎన్నికల బరిలో దూసుకుపోతోంది. ఇక ఈ వ్యూహకర్తలిచ్చిన సూచనలతోనే, టీవీకే నుంచి 17మంది విజయ్ పేరున్న నేతలు బరిలో దిగు తున్నట్లు సమాచారం. అలాగే 10 సూత్రాల యువజన అజెండా, అధికారంలోకి వస్తే 30 లక్షల మంది యువతకు వాలంటీర్ల తరహాలో ఉపాధి వంటి హామీలిచ్చినట్లు తెలిసింది. ఇక తమిళనాడు సరిహద్దుల్లోని కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరి లోనూ దాదాపుగా ఎన్డీయే, ఇండియా కూటములు ఇదే స్ట్రాటజిస్టులతో ముందుకెళ్తున్నాయి.

### బెంగాల్ దంగల్‌లో ఎత్తులకు పైఎత్తులు...!

దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన బెంగాల్ ఎన్నికల్లో మరోసారి సత్తాచాటాలని, బీజేపీని చావుదెబ్బ కొట్టాలని భావిస్తున్న బెంగాల్ బెబ్బులి మమతా బెనర్జీ 2021 ఎన్నికల తరహాలోనే ఐప్యాక్ టీమ్‌ను 2026 ఎన్నికల్లోనూ నమ్ముకుంది. ఇందులో భాగంగా ప్రశాంత్ కిషోర్ సహచరుడు ఐప్యాక్ సహ వ్యవస్థా పకుడు ప్రతీక్ జైన్ ప్రధాన వ్యూహకర్తగా ఆమె ఎన్నికల బరిలో పోరాడుతున్నారు. కాగా వీరి సలహాతోనే సర్(స్పెషల్ ఇంటెన్సివ్ కేర్)కు అడ్డంకులు సృష్టించడం, బీజేపీ అధికారంలోకి వస్తే చేపలు, మాంసం అందుబాటులో ఉండబోవని ఆమె ఓటర్లను హెచ్చరిస్తూ ప్రసంగిస్తున్నట్లు సమాచారం. ఇక ప్రతీక్ జైన్‌పై ఈడీ దాడులు నిర్వహించడం కూడా కేంద్ర పెద్దల పనేనంటూ ఆమె బెంగాల్ ఓటర్ల నుంచి సానుభూతి పొందే ప్రయత్నం కూడా చేస్తున్నారు. ఇక ఎలాగైనా బెంగాల్‌లో దీదీ పాలనకు అడ్డుకట్ట వేసేందుకు సామ దాన భేద దండోపాయాలతో బీజేపీ పెద్దలు వ్యూహాలు రచిస్తున్నారు. ఇందుకోసం వీరు కూడా అసోసియేషన్ ఆఫ్ బిలియన్ మైండ్స్(ఏబీఎం) అనే స్ట్రాటజీ సంస్థను పార్టీపరంగా ఏర్పాటు చేసుకుని అమిత్‌షా నేతృత్వంలో మమత ప్రభుత్వంలో చోటు చేసుకున్న కుంభకోణాలు, విద్యార్థిను లపై అత్యాచారాలు, రాష్ట్రాన్ని విదేశీ శక్తులకు తాకట్టుపెడు తోందంటూ ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఇక మరో జాతీయ పార్టీ కాంగ్రెస్ కూడా సునీల్ కనుగోలు సూచనలతోనే గతంలో తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో గెలిచింది. దీంతో మరోసారి ఆయన మార్గదర్శకత్వంలోనే తమిళనాడు, బెంగాల్, పుదుచ్చేరి రాష్ట్రాల్లో వీలైనంత ఎక్కువ సీట్లు గెలిచేందుకు వ్యూహాలు రూపొందిస్తోంది.

### కేరళ, అస్సోంలలో...!

ఇక మరో దక్షిణాది రాష్ట్రం కేరళలోనూ ఎన్నికల వ్యూహకర్త లను నమ్ముకునే అధికార ఎల్డీఎఫ్, ప్రతిపక్ష యూడీఎఫ్ కూటములు ఎన్నికల బరిలో నువ్వా-నేనా అన్నట్లు తలపడుతున్నాయి. ఈ రాష్ట్రంలో ఇరు కూటములకు గెలుపు అవకాశాలు ఉండడంతో వ్యూహకర్తల పాత్ర అత్యంత కీలకంగా మారింది. ఇక్కడ కూడా సునీల్ కనుగోలు, శరత్ పానికర్, మార్టిన్ జోస్, అజయ్ ఎస్ నాయకర్ వంటి వ్యూహకర్తలు ఆయా పార్టీలకు సూచనలు, సలహాలు అందిస్తున్నారు. అలాగే ఫ్రెష్‌మైండ్ ఐడియాస్ (తిరువంతపురం), మోరిస్ మీడియా, ఇన్‌క్లూజివ్ మైండ్స్ వంటి సంస్థలు ప్రధాన పార్టీలైన వామపక్షాలు, కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్‌కు సాయపడుతున్నాయి. ఇక ఈశాన్యరాష్ట్రం అస్సోంలో జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ వ్యూహకర్తల సాయంతోనే గెలుపుగుర్రం ఎక్కేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నాయి.

ఏదేమైనా ఇండియన్ పొలిటిక్స్‌లో ప్రస్తుతం ఈవెంట్ మేనేజర్ల హవా కొనసాగుతోందనడంలో సందేహం లేదు. పార్టీల అధినేతలు తమ వ్యూహకర్తలు చెప్పిన విధంగానే స్ట్రాటజీలు రూపొందించుకుని సత్తాచాటేందుకు యత్నిస్తున్నారు. ఈ క్రమంలో వ్యూహకర్తలు ఇస్తున్న నినాదాలు, ఏఐ సాంకేతికతో ఓటర్ల నాడిని విశ్లేషించడం వంటి అంశాలు ఎన్నికల రణక్షేత్రంలో కీలకంగా మారుతున్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే ఎన్నికల యుద్ధంలో పాత్రధారులు రాజకీయనాయకులే అయినా తెరవెనుక సూత్ర ధారులు మాత్రం వ్యూహకర్తలే అనడంలో సందేహం లేదు. మరి ఎవరి వ్యూహాలు ఫలిస్తాయో, ఎవరి వ్యూహాలు చతికిల పడుతాయో ఐదు రాష్ట్రాల ఫలితాలు లెక్కించే మే4న తేలిపో నుంది. మొత్తంమీద రాష్ట్రాల భవిష్యత్తుతో పాటు దేశ భవిష్యత్తు కూడా ఈ కింగ్‌మేకర్‌ల వ్యూహాలపైనే ఆధారపడి వుందన్నది మాత్రం ముమ్మాటికీ నిజం..!

## 20న సీఎం చంద్రబాబునాయుడు..
# పుట్టినరోజు వేడుకలు

### ఆత్మకూరులో సంబరాలు మిన్నంటాలన్న మంత్రి ఆనం



ఈనెల 20న రాష్ట్ర అభివృద్ధి రథసారథి నారా చంద్రబాబునాయుడు జన్మదిన సంబరాల సందర్భంగా ఆ రోజున ఆత్మకూరులో పలు ప్రారంభోత్సవాలు చేస్తామని, చంద్రబాబు జన్మదిన వేడుకలు వైభవంగా నిర్వహిస్తామని రాష్ట్ర దేవాదాయమంత్రి ఆనం రామనారాయణ రెడ్డి చెప్పారు. ఈనెల 7న ఆయన ఆత్మకూరు ఆర్ అండ్ బి అతిథి గృహంలో జరిగిన సమావేశంలో పార్టీ శ్రేణులకు ఆమేరకు దిశా నిర్దేశం చేశారు. ఆరోజున నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చేపడుతున్నామని తెలిపారు. సీఎం పిలుపుమేరకు జలధార కార్యక్రమం ద్వారా గ్రామ గ్రామాన చెరువులు, సాగునీటి కాలువల అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఇప్పటికే కాలువలు, చెరువుల మరమ్మతుల కోసం నియోజకవర్గంలో 28 కోట్ల నిధులను మంజూరు చేశామన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో పండుగ వాతావరణంలో ముఖ్యమంత్రి జన్మదినోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని ఆయన సూచించారు.

# డా. సతీష్‌రెడ్డికి మరో గౌరవం

- ఐఐటీ గౌరవ సలహాదారుగా నియామకం



దాదాపు నాలుగు దశాబ్దాల పాటు భారత రక్షణ మరియు ఏరోస్పేస్ రంగాలలో అపార అనుభవం సముపార్జించుకున్న ప్రముఖ శాస్త్రవేత్త, డీఆర్‌డీఓ మాజీ ఛైర్మన్.. మన నెల్లూరీయులు డా.జి.సతీష్‌రెడ్డికి మరో అపూర్వ గౌరవం లభించింది. రక్షణ రంగంలో సరికొత్త ఆవిష్కరణలు చేపట్టే విద్యార్థులకు మరియు పరిశోధకులకు మార్గదర్శకత్వం వహిస్తున్న ఆయనకు, హైదరాబాద్‌లోని (ఐఐటీహెచ్) పరిశోధన మరియు అభివృద్ధి (ఆర్ అండ్ డీ) విభాగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఒక కీలక అడుగుపడింది. భారత జాతీయ భద్రతా సలహా మండలి(ఎన్ఎస్ఏబీ) సభ్యులు మరియు రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఓ) మాజీ ఛైర్మన్‌గా సేవలందించిన డాక్టర్ జి.సతీష్‌రెడ్డి ఐఐటీ హైదరాబాద్‌కు గౌరవ సలహాదారుగా నియమితులు కావడం విశేషం. దేశ రక్షణ వ్యవస్థ స్వయం సమృద్ధి సాధించడంలోనూ, అత్యాధునిక క్షిపణి సాంకేతికతను అభివృద్ధి చేయడంలోనూ డాక్టర్ సతీష్‌రెడ్డి పోషించిన పాత్ర అద్వితీయం. ఇప్పుడు ఆయన అపారమైన అనుభవం ఐఐటీ హైదరాబాద్‌లోని పరిశోధనలకు కొత్త జవజీవాలను అందించనుంది. రక్షణ రంగంలో సరికొత్త ఆవిష్కరణలు చేపట్టే విద్యార్థు లకు మరియు పరిశోధకులకు ఆయన మార్గదర్శకత్వం కొండంత స్ఫూర్తినిస్తుందని ఐఐటీ హైదరాబాద్ ఈ సందర్భంగా పేర్కొంది. గతంలో డిఆర్‌డిఓ ఛైర్మన్‌గా ఉంటూ భారతరక్షణ రంగానికి అపూర్వమైన సేవలందించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో ప్రశంసలను అవార్డులను అందుకున్న సతీష్‌రెడ్డి తాజాగా సాంకేతిక రంగంలో గ్లోబల్ హబ్‌గా ఎదుగుతున్న ఐఐటీ హైదరాబాద్‌కు సలహాదారుగా నియామకం కావడం విశేషం! ఈ సందర్భంగా డా. సతీష్‌రెడ్డిని అభినందిస్తూ దేశంలోని అనేక సాంకేతిక విజ్ఞాన సంస్థలు, విద్యావేత్తలు మరియు పారిశ్రామిక వర్గాల వారు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## హాస్టల్ పిల్లలూ!..
# మండుటెండలతో జాగ్రత్త!

### సాంఘిక సంక్షేమశాఖ డీడీ శోభారాణి



అధికారులతో సమీక్షిస్తున్న డీడీ శోభారాణి

ఈ మండు వేసవిలో హాస్టల్ విద్యార్థులు ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని, మండుటెండల్లో తిరగవద్దని సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.శోభారాణి సూచించారు. ఈనెల 8న నెల్లూరులోని తమ కార్యాలయంలో సహాయ సంక్షేమ అధికారులతో ఆమె సమావేశమై హాస్టల్ విద్యార్థుల స్థితిగతులను సమీక్షించారు. విద్యార్థులకు చల్లని మంచినీరు, మజ్జిగ అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ప్రత్యేకించి బాలికల వసతి గృహాల్లో ఉన్న విద్యార్థినులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలన్నారు. ఈనెల 14న జరిగే భారతరత్న డా.బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి వేడుకలను పండుగ వాతావరణంలో జరుపుకునేలా అందరూ కలిసికట్టుగా కృషిచేయాలని ఆమె ఈ సందర్భంగా సూచించారు.


అక్షరాభివందనాలు



బహుముఖ ప్రజ్ఞాశాలి,
భారతీయ వైద్య ఆరోగ్య రంగంలో
సంచలనం సృష్టించిన ధీశాలి,
మానవీయ విలువలున్న దానగుణశీలి,
మాకు అత్యంత ఆప్తులు, మా శ్రేయోభిలాషులు
పెద్దలు, గౌరవనీయులు
"పద్మభూషణ్"
డాక్టర్ కె.ఐ.వరప్రసాద్‌రెడ్డి గారు



విద్యార్థిగా తాను ఎన్నో అనుభవాలని, అనుభూతులని,
అక్షరజ్ఞానంతో పాటు జీవిత పాఠాలని నేర్చుకున్న కాకినాడలోని
జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్శిటీ
వారు అందించిన "గౌరవ డాక్టరేట్"ని
ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ గారి
చేతులమీదుగా స్వీకరించిన శుభవేళ
మా అక్షరాభివందనాలు.

SMD HOMES
Value beyond Bricks
BANGALORE - BHARATH

లాయర్
ఏప్రిల్ 10, 2026

# సమాజానికి రక్షణ.. 'మాతృ సంరక్షణ'

తల్లి ఎక్కడైనా తల్లే. మనకు జన్మనిచ్చే మాతృమూర్తి అనురాగ ప్రేమమూర్తే. మాతృత్వం.. స్త్రీమూర్తులకు ఆ భగవంతుడు ఇచ్చిన వరం. మానవతకు మూలం మాతృత్వ మేనని, అంతులేని త్యాగానికి, అపురూపమైన సహనానికి మాతృమూర్తులే ప్రత్యక్ష నిదర్శనాలని పెద్దలు చెప్తుంటారు కూడా. అయితే, అలాంటి అమృతమూర్తులను మనం సరిగా చూసుకుంటున్నామా?.. మాతృ సంరక్షణ సక్రమంగా ఉం టోందా?.. ప్రసూతి మరణాలు లేదా..మాతాశిశు మరణాలు లేకుండా కాపాడుకోగలుగుతున్నామా?..అన్నది ప్రశ్నార్థకమే. ఒక్క మనదేశంలోనే కాదు.. ప్రపంచమంతటా 'మాతృ సంరక్షణ' అనేది కేవలం మాటలకే పరిమితమవుతోంది. 'సురక్షితమైన మాతృత్వం' అనేది అనేక ప్రాంతాల్లో అందని ద్రాక్షలా ఉంటోంది. మనదేశంలోనూ ప్రసూతి సమస్యలు, ఆసుపత్రుల్లో వేదనలు..అనేక సంఘటనల్లో తల్లుల మరణాలు తగ్గడం లేదు. మాతృత్వం లభించడం, బిడ్డకు జన్మనివ్వడం, కన్నబిడ్డను కంటికి రెప్పలా పెంచడం, వారిని బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దడం వంటివన్నీ ఎంతో అపూర్వమైన.. అమూల్యమైన విషయాలన్నది అందరికీ తెలిసిందే. అయినా.. నరకయాతన పడైనా సరే, బిడ్డకు జన్మనిచ్చే తల్లికి మనమే మివ్వగలం?..సాగిలబడి నమస్కరించడం తప్ప..తల్లికి ఏమిచ్చి మనం రుణం తీర్చుకోగలం?..సృష్టిలోనే నిస్వార్థప్రేమకి నిలువెత్తు నిదర్శనం తల్లి ఒక్కటే. ఎవరికైనా ప్రత్యక్ష దైవం తల్లే. అయితే, బిడ్డకి జన్మనిచ్చే తల్లి ప్రసవ సమయంలో పడే వేదన మాటల్లో వర్ణించలేనిది. ప్రాణానికి ప్రాణమిచ్చి బిడ్డను ప్రసవించే సమయంలో ఆ మాతృమూర్తిని జాగ్రత్తగా కాపాడుకోకపోతే ఆమె ప్రాణాలకే ప్రమాదం ఏర్పడుతుంది. కారణాలేమైతేనేం.. ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా ప్రతి నిత్యం కనీసం 8 వందల ప్రసూతి మరణాలు సంభవిస్తూనే ఉన్నా యని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. అంతేకాదు, ప్రపం చంలో నమోదయ్యే ప్రసూతి మరణాల్లో 15 శాతం వరకు ఒక్క భారత్‌లోనో ఉన్నాయని, మనదేశంలోనూ మాతృ సంరక్షణ అనేది ఆశించిన స్థాయిలో లేకపోవడం వల్ల ప్రతి ఏటా 44వేల మంది వరకు మహిళలు మృత్యువు పాలవు తున్నారని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి ప్రభుత్వాల ప్రత్యేక చర్యల వల్ల, మనదేశంలో గతంలో కంటే మాతాశిశు మరణాలు 80 శాతానికి పైగానే తగ్గడం ఎంతో సంతోషించదగ్గ విషయం. అయినప్పటికీ, ఇప్పటికీ.. 2023లో 24వేలకు పైగానే మరణాలు సంభవించడం విచారించతగ్గ అంశం. లాన్సెట్ నివేదిక ప్రకారం 2023లో ప్రపంచవ్యాప్తంగా 2.4 లక్షల ప్రసూతి మరణాలు జరిగాయి. ఈ నేపథ్యంలో మనదేశంలో మాతృసంరక్షణ పట్ల మరింత అవగాహన పెంపొందించేందుకు గతంలోనే భారత ప్రభుత్వం ఏప్రిల్ 11వ తేదీని జాతీయ సురక్షత మాతృత్వ దినోత్సవంగా పరిగ ణిస్తోంది. ప్రసూతి మరణాలు తగ్గించేందుకు ప్రసవానికి ముందు, ఆ తరువాత తీసుకోవాల్సిన ఆరోగ్యపరమైన జాగ్రత్తలను మహిళాలోకానికి వివరించాలని నిర్ణయించింది. అదేరోజును కస్తూర్బాగాంధీ పుట్టినరోజును కూడా జరుపు కోవడం ఆనవాయితీగా వస్తోంది. గర్భధారణ, ప్రసవానికి సంబంధించిన అంశాల్లో ఆరోగ్య పరిస్థితులపై దృష్టి సారిస్తే గర్భిణులను, మాతృమూర్తులను మరణాలకు లోను కాకుండా రక్షించుకోవచ్చని, వాటిలో అనేకం మనం నివారించు కోగలిగిన మరణాలేనని ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా సూచిస్తోంది. ప్రసవ సమయంలో సమస్యలు, రక్తస్రావం అధికం కావడం, ఇన్‌ఫెక్షన్లు, అధిక రక్తపోటు వంటి కారణాల వల్ల మరణాలు ఎక్కువగా జరుగుతున్నాయని వైద్యవర్గాల విశ్లేషణ. ఈ పరిస్థితుల్లో ఇకనైనా మరింత మేలైన మార్పులు రావాలని ఆకాంక్షిస్తూ జరుపుకునే 'జాతీయ సురక్షితా మాతృత్వ దినోత్సవం' ఎంతో ముఖ్యమైనది. తల్లులకు, స్త్రీమూర్తులకు ఆరోగ్యపరమైన అంశాలను తెలియజేసి, ప్రసూతి మరణాలు తగ్గించేందుకు.. నాణ్యమైన సంరక్షణను అందించేందుకు ఎవరి వంతు కృషి వారు చేయాల్సి ఉంది. ఆసుపత్రులను, వైద్య చికిత్సలను, ఆరోగ్యవ్యవస్థలను ప్రభుత్వాలు అందరికీ అందుబాటులోకి తెచ్చి, వాటిని బలోపేతం చేసేందుకు కృషి చేయడం ద్వారా మాతృత్వ దినోత్సవానికి సార్ధకత చేకూర్చాల్సి ఉంది. ఒక్క తల్లిని కోల్పోయినా ఆ కుటుంబాలు ఎంత వేదనకు గురవుతాయో ఊహించుకోవచ్చు. ఒక్క అమ్మను కాపాడుకుంటే, ఆ కుటుంబాన్నంతా కాపాడుకున్నట్లే. ఆ దిశలో అందరూ సరైన అవగాహనతో ముందుకు సాగితే, మాతృమరణాలు తగ్గి పోయి.. ఆ కుటుంబాలు సంతోషంతో జీవించేందుకు దోహద పడినట్లవుతుంది. 'మాతృ సంరక్షణ' ద్వారా కుటుంబానికే కాక, మొత్తంగా సమాజానికి రక్షణ చేకూర్చుకున్నట్లవుతుంది!

# ఇంధన భద్రతకు సిద్ధమా?

మనసులో మాట 92

నేడు ప్రపంచం ఒక అనిశ్చిత స్థితిలో ఉంది. పశ్చిమ ఆసియాలో రగులుతున్న యుద్ధ జ్వాలలు కేవలం ఆ ప్రాంతానికే పరిమితం కాకుండా, ప్రపంచ ఇంధన సరఫరా వ్యవస్థలను అతలాకుతలం చేస్తున్నాయి. ఇంధన దిగుమతులపై ఆధారపడిన దేశాలకు ఇది ఒక పెద్ద సవాలుగా మారింది. ముఖ్యంగా 'హోర్ముజ్ జలసంధి' మూతపడటం లేదా అక్కడ రవాణాలో అంతరాయం కలగడం అంటే భారతదేశం వంటి దేశాల ఆర్థిక వ్యవస్థకు ఊపిరి ఆగిపోవడమే. ప్రతిరోజూ దాదాపు 21 మిలియన్ బారెళ్ల చమురు ఈ ఇరుకైన జలసంధి గుండా ప్రవహిస్తుంది. ఈ నేపథ్యంలో, భారతదేశం తన ఇంధన భద్రతను ఎలా కాపాడుకోబోతోంది? మన వ్యూహం ఏమిటి? భవిష్యత్తుకు మనం ఎంతవరకు సిద్ధంగా ఉన్నాం? అన్న అంశాలను లోతుగా పరిశీలించాల్సిన అవసరం ఉంది.

భారతదేశం తన చమురు అవసరాలలో దాదాపు 91% దిగుమతులపైనే ఆధారపడుతోంది. ఇది ఒక చారిత్రక గరిష్ట స్థాయి. మార్చి 2026 నాటి తాజా గణాంకాల ప్రకారం, మన చమురు దిగుమతులలో 54% వాటా కేవలం పశ్చిమ ఆసియా దేశాల నుండే వస్తోంది. ఇరాన్-ఇజ్రాయెల్ ఉద్రిక్తతల వల్ల అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధర ఫిబ్రవరిలో ఉన్న 69 డాలర్ల నుంచి మార్చి నాటికి 114 డాలర్లకు, ఏప్రిల్ తొలి వారంలో 126 డాలర్లకు చేరుకుంది. అంటే కేవలం రెండు నెలల్లోనే ధర దాదాపు రెట్టింపు అయ్యింది. ముడి చమురు ధరలో ప్రతి 10 డాలర్ల పెరుగుదల మన దేశ దిగుమతి బిల్లును దాదాపు రూ.1.25 లక్షల కోట్ల మేర పెంచుతుంది. ఇది మన కరెంట్ అకౌంట్ లోటును తీవ్రం చేయడమే కాకుండా, రూపాయి విలువను పతనం చేస్తూ, వంటగ్యాస్ మరియు రవాణా ఖర్చులను సామాన్యుడికి భారంగా మారుస్తోంది.

## మన సన్నద్ధత: వ్యూహాత్మక నిల్వలు

ఈ ఆకస్మిక షాక్‌లను తట్టుకోవడానికి భారతదేశం 'స్ట్రాటజిక్ పెట్రోలియం రిజర్వ్స్'ను ఏర్పాటు చేసుకుంది. విశాఖపట్నం, మంగళూరు, పదూర్ వంటి చోట్ల మనకు ప్రస్తుతం 5.33 మిలియన్ మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం ఉంది. ఫిబ్రవరి 2026 నాటి నివేదికల ప్రకారం, ఈ నిల్వలు 77% నిండి ఉన్నాయి. యుద్ధం కారణంగా సరఫరా పూర్తిగా నిలిచిపోయినా, మన దేశం కనీసం 9.5 రోజుల పాటు తట్టుకోగలదు. దీనికి అదనంగా ప్రభుత్వ రంగ చమురు కంపెనీల వద్ద మరో 64 రోజుల నిల్వలు ఉన్నాయి. వెరసి సుమారు 74 రోజుల భద్రత మనకుంది. దీనికి అదనంగా, ఒడిశాలోని చండిఖోల్ మరియు కర్ణాటకలోని పదూర్‌లలో మరో 6.5 మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో రెండో దశ నిల్వలను ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన వేగవంతం చేస్తోంది.

## సుస్థిర నమూనా కావాలి

కేవలం నిల్వలు ఉంటే సరిపోదు, అసలు శిలాజ ఇంధనాలపై ఆధారపడటమే తగ్గించాలన్నది మన దీర్ఘకాలిక వ్యూహం. దీనికోసం ప్రభుత్వం మూడు ప్రధాన మార్గాలను అనుసరిస్తోంది.

**గ్రీన్ హైడ్రోజన్ విప్లవం:** నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ ద్వారా 2030 నాటికి 5 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఫిబ్రవరి 2026 నాటికి ఇప్పటికే 8,000 టన్నుల సామర్థ్యం గల ప్లాంట్లు ప్రారంభమయ్యాయి. హైడ్రోజన్ ధరను కిలోకు రెండు డాలర్లకు తగ్గించడమే మన లక్ష్యం. దీనివల్ల భారీ పరిశ్రమల్లో బొగ్గు వాడకం తగ్గి, విదేశీ మారక ద్రవ్యం ఆదా అవుతుంది.

**ఇథనాల్ బ్లెండింగ్:** పెట్రోల్‌లో ఇథనాల్ మిశ్రమాన్ని ఇప్పటికే 20% స్థాయికి చేర్చాం. ఇది కేవలం పర్యావరణానికే కాదు, మన రైతులకు అదనపు ఆదాయాన్ని ఇస్తూ, విదేశీ దిగుమతులపై భారాన్ని తగ్గిస్తుంది.

**విద్యుదీకరణ:** రవాణా రంగంలో 2025 నాటికి 20 లక్షలకు పైగా ఎలక్ట్రిక్ వాహనాలు నమోదు కావడం ఒక శుభపరిణామం. వంటగ్యాస్‌పై భారాన్ని తగ్గించడానికి ఇండక్షన్ మరియు హీట్-పంప్ వంటి పద్ధతులను పట్టణ ప్రాంతాల్లో ప్రోత్సహించడం ద్వారా మనం గ్యాస్ దిగుమతులను గణనీయంగా తగ్గించవచ్చు. ముఖ్యంగా మన వద్ద ఉన్న థోరియం నిల్వలను ఉపయోగించి అణు విద్యుత్ ఉత్పత్తిని పెంచడం ద్వారా మనం తరతరాలకు సరిపడా శక్తిని పొందవచ్చు.

## ఇంధన సార్వభౌమత్వమే లక్ష్యం

పశ్చిమ ఆసియా యుద్ధం మనకు ఒక గట్టి హెచ్చరిక. ముడి చమురు ధరలు పెరిగినప్పుడల్లా మన ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో పడకూడదంటే, మనం "ఇంధన సార్వభౌమత్వం" సాధించాలి. అంటే మనం ఇంధనాన్ని దిగుమతి చేసుకునే దేశం నుండి, ఎగుమతి చేసే దేశంగా మారాలి. 2047 నాటికి వికసిత్ భారత్ సాధించా లంటే, అది కేవలం 'క్లీన్ ఎనర్జీ' ద్వారానే సాధ్యం. సౌర, పవన మరియు అణు విద్యుత్ రంగాలలో మనం స్వయం సమృద్ధి సాధించినప్పుడే, ప్రపంచంలో ఎక్కడ యుద్ధం జరిగినా మన వంటిల్లు, మన రవాణా రంగం సురక్షితంగా ఉంటాయి. నేడు మనం చేస్తున్న ఈ పునరుత్పాదక ఇంధన పెట్టుబడులే రేపటి తరానికి నిజమైన రక్షణ కవచాలు. మన పౌరులు కూడా ఇంధన పొదుపును ఒక సామాజిక బాధ్యతగా స్వీకరించాలి. అప్పుడే నిజమైన ఇంధన స్వతంత్ర భారతం సాధ్యమవుతుంది.



**- తుమ్మల బాల గంగాధర్ తిలక్**

# తప్పు తెలుసుకోలేకపోతున్న జగన్!

ఈ-మెయిల్ ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

"రాజకీయాలలో హత్యలు వుండవు ఆత్మహత్యలే" అన్న మాట వై.యస్.ఆర్ కాంగ్రెస్‌పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డికి సరిగ్గా సరిపోతుంది. గత ఎన్నికలలో ఆంధ్రప్రదేశ్ ఓటర్లు జగన్‌రెడ్డికి కేవలం 11 సీట్లు ఇచ్చి సరిపెట్టారంటే.. అది ముమ్మాటికీ ఆయన స్వయంకృతాపరాధమే. అప్పటికీ 40 శాతం మంది ఆంధ్రా జనం జగన్‌కే జైకొట్టారు. కానీ, ప్రతిపక్ష నాయ కుడిగా ఆయన వేస్తున్న తప్పటడుగులు, చేస్తున్న అసంబద్ధ ప్రకటనలు ఆ 40 శాతాన్ని కూడా ఆయనకి దూరం చేస్తున్నా యనడంలో సందేహం లేదు. ప్రతిపక్ష హోదా కావాలని మంకుపట్టు పట్టి అసెంబ్లీకి ముఖం చాటేయడం, కేవలం ప్రెస్‌మీట్లకే పరిమితం కావడం, ఇంకా సజ్జలనే చంక నెత్తుకోవడం, అధికారపక్షాన్ని వ్యూహాత్మ కంగా ఎదుర్కోలేకపోవడం ఆయనలోనూ, ఆ పార్టీలోనూ కనిపిస్తున్న స్పష్టమైన లోపాలు. తాజాగా ఆంధ్రా రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే క్రమంలో జగన్‌రెడ్డి ప్రవర్తించిన తీరు ఆయనలోని రాజకీయ అపరిపక్వతకి అద్దం పడుతుంది. అమరావతికి తాము వ్యతిరేకం కాదం టూనే 'మావిగన్' అనే కొత్త ప్రతిపాదనని తెరపైకి తెచ్చి అపహాస్యం పాలయ్యాడు. ఉభయ సభల్లోనూ తమ సభ్యుల చేత వాకవుట్ చేయించి చారిత్రాత్మక తప్పిదం చేశాడు. రాజధాని పేరుతో చంద్రబాబు డ్రామా ఆడుతున్నాడంటూ అర్ధరహిత ఆరోపణలకి తెరలేపాడు. ఇలా తప్పు మీద తప్పుచేసుకుంటూ అధికారపక్షం మరింత బలోపేతం కావడానికి పరోక్షంగానూ, ప్రత్యక్షంగానూ జగన్‌రెడ్డి దోహదపడుతు న్నాడనడానికి సందేహం అవసరం లేదు.

*యం. చంద్రమౌళి,* **కొత్తఢిల్లీ.**

# డమ్మీగా మారిన నెల్లూరు ట్రాఫిక్ పోలీసు వ్యవస్థ!

నెల్లూరు నగరంలో ట్రాఫిక్ పోలీసు వ్యవస్థ పూర్తిగా డమ్మీగా మారిపోయింది. అస్తవ్యస్తమైన ట్రాఫిక్‌తో నగరం నరకాన్ని తలపిస్తోంది. ముఖ్యంగా పార్కింగ్ విధానం పూర్తిగా అటకెక్కింది. వాహనదారులు తమ ఇష్టానుసారం నడిరోడ్లపైనే తమ వాహనాలని నిలిపేస్తున్నారు. ఇక ఆటోవాలాల సంగతైతే అస్సలు చెప్పనవసరం లేదు. మమ్మల్ని అడిగే మగాడు ఎవరన్నట్లుగా ఆటోడ్రైవర్లు ప్రవర్తిస్తున్నారు. ముఖ్యంగా నగరంలోని మినీబైపాస్‌లో వున్న అన్ని కూడళ్ళలో ఇదే పరిస్థితి. అయ్యప్పగుడి వద్దనుండి గమనిస్తే భక్తవత్సలనగర్, కొండాయపాలెం కూడలి, అన్నమయ్య సర్కిల్, రామలింగాపురం జంక్షన్, నేతాజీ బొమ్మ, పూలే బొమ్మ, ఆత్మకూరు బస్టాండు వరకూ ఇదే తంతు. భక్తవత్సలనగర్ కూడలిలో నడిరోడ్డుపై డివైడర్ల మధ్య ట్రాక్టర్ తొట్టిలో ఓ ఘనుడు కూరగాయల వ్యాపారం చేస్తున్నాడు. అన్నమయ్య కూడలిలో ఓ బడా హోటల్ యాజమాన్యం తమ అతిథుల వాహనాల పార్కింగుకి రోడ్డునే అడ్డాగా మార్చేసింది. మినీబైపాస్‌తో పోలిస్తే.. ట్రంకురోడ్డు కొంతవరకు మేలనిపిస్తుంది. ఆర్.టీ.సీ కూడలి, మద్రాసు బస్టాండు ప్రాంతం, వీ.ఆర్.సీ జంక్షన్, గాంధీబొమ్మ, ఏ.సీ సెంటర్‌లలో కొంత పోలీసు అజమాయిషీ కనిపిస్తుంది. మినీ బైపాస్‌ని మాత్రం ఆ శాఖ గాలికి వదిలేసినట్లుంది. ఎస్.పి మేడం దృష్టిపెట్టి మినీబైపాస్‌లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలి.

*ఆర్.పీ.రామయ్య,* **కొండాయపాళెం.**


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర, పక్కన ఎమ్మెల్యేలు సోమిరెడ్డి, కృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, కలెక్టర్ హిమాన్షు శుక్ల

# అక్రమవేటను అరికట్టేందుకు.. నాలుగు గస్తీ బోట్లు

**• మంత్రి కొల్లు రవీంద్ర**

రాష్ట్రంలోని మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని, నెల్లూరు తీరంలో తమిళనాడు బోట్ల వారి అక్రమ వేటను అరికట్టేందుకు గట్టి చర్యలు తీసుకుంటున్నామని, రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర చెప్పారు. ఈనెల 5న నెల్లూరు కలెక్టరేట్‌లో పుదుచ్చేరి, తమిళనాడు రాష్ట్రాల మత్స్యకారుల నుండి నెల్లూరు జిల్లాలోని మత్స్యకారులకు ఎదురవుతున్న సమస్యల గురించి జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, శాసనమండలి సభ్యులు బీద రవిచంద్ర, శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, దగుమాటి వెంకట కృష్ణారెడ్డి, కోస్టల్ సెక్యూరిటీ ఐజి గోపినాథ్‌జెట్టిలతో మంత్రి రవీంద్ర సమీక్షించారు. అనంతరం పాత్రికేయులతో మంత్రి మాట్లాడుతూ, మత్స్యకారుల సమస్యల శాశ్వత పరిష్కారానికై కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని, ముఖ్యమంత్రి సైతం ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించి తగు ఆదేశాలు అందజేశారన్నారు. ఇప్పటికే మూడు గస్తీ బోట్లు సముద్రంలో నిరంతరం గస్తీ నిర్వహిస్తున్నాయని, మరొక బోటును తిరుపతిలో ఈరోజు నుండి అందుబాటులో ఉంచామన్నారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను రాబోయే కొద్ది రోజుల్లో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పులికాట్ సరస్సు పూడిక తీత పనులు కోసం శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ముఖ్యమంత్రికి అందజేసిన ప్రతిపాదనలను ప్రభుత్వం పరిశీలిస్తుందన్నారు. ముత్తుకూరు మండలంలోని నేలటూరు ఫిషింగ్ జెట్టీ నిర్మాణాన్ని కూడా అతి త్వరలోనే పూర్తి చేసేందుకు ప్రభుత్వం కృషిచేస్తోందని, అదే విధంగా జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌లో పెండింగ్ పనులను కూడా త్వరలోనే పూర్తి చేసేలా చర్యలు చేపట్టామని తెలిపారు. ఏఎస్‌పి సౌజన్య, మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ శాంతి తదితరులు పాల్గొన్నారు.

# అమరావతిని వ్యతిరేకించేవారికి దేవుడే బుద్ధిచెప్పాడు

**• సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి**


మనవడితో కలిసి బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

'దేశంలోని 11 పార్టీలు అమరావతిని ముక్తకంఠంతో సమర్థిస్తే, అసెంబ్లీలో 11 సీట్లున్న జగన్‌రెడ్డి పార్టీ పార్లమెంటు నుంచి పారిపోయింది. జగన్ 'మావిగన్'తో సరిపెట్టాడు.. ఇంకా నయం.. పులివెందుల గన్ అనలేదు. అసలు వైసీపీయే ఒక గన్ పార్టీ.. గొడ్డలి పార్టీ.. అని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఇటీవల ఆయన మనుబోలులో నిర్వహించిన అమరావతి విజయోత్సవ ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. రాజధానిగా అమరావతిని వ్యతిరేకించిన వారందరికీ దేవుడు బుద్ధి చెప్పాడన్నారు. రైతుల గోష్టే వైసీపీకి తగలిందన్నారు. తిరుమలకు పాదయాత్రగా బయలుదేరిన అమరావతి మహిళా రైతులను భోజనం కూడా ప్రశాంతంగా తిననీయకుండా ఆనాటి మంత్రి కాకాణి వేధించాడని, పొదలకూరు సమీపంలో నీడ కోసం వేసిన టెంట్లను పెరికించేసి నడిరోడ్డుపై వారిని అవమానకరంగా కూర్చోపెట్టాడని ఆయన గుర్తుచేశారు. అయితే రైతుల త్యాగాలు, కష్టాలు వృథా కాలేదని, దేశంలోనే నంబర్ 1 రాజధానిగా అమరావతి రూపుదిద్దుకుంటోందని చెప్పారు. ఏపీ రాజధానిగా అమరావతిని ఆమోదిస్తూ పార్లమెంటు చట్టం చేయడం సంతోషమని, రాష్ట్ర ప్రజలందరికీ ఇది గర్వకారణమని అన్నారు. సీఎం చంద్రబాబునాయుడు రాజధాని నిర్మాణం విషయంలో అద్భుత ప్రణాళికతో ముందుకు సాగుతున్నారని, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు కేంద్రంగా అమరావతి ఎంపిక జరిగిందన్నారు. అమరావతికి అద్భుతమైన భవిష్యత్తు ఉండబోతోంది... భారీ భవంతులు రాబోతున్నాయి.. రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరందుకుంటుంది..భూముల విలువ పెరుగుతుందని, గతంలో సైబరాబాద్‌ను సృష్టించిన చంద్రబాబునాయుడు చేతిలో అమరావతి ఏ విధంగా రూపుదిద్దుకుంటుందో అందరూ త్వరలోనే చూస్తారని అన్నారు. తొలుత చేరెడ్డి పద్మనాభరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన విజయోత్సవ సభ సందర్భంగా ఆయన మనుబోలు ఎస్సీ కాలనీలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి కోదండరామపురం సెంటర్ వరకు జరిగిన ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం సుమారు 200 మంది గిరిజనులకు చీరల పంపిణీ చేశారు.

# ఆరోగ్యమే.. విలువైన సంపద

**• ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల**

ఆరోగ్యమే మనిషి జీవితంలో అత్యంత విలువైన సంపద అని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. ప్రపంచ ఆరోగ్యదినోత్సవం సందర్భంగా ఈనెల 7న వింజమూరులో డాక్టర్ మాసిలామణి చిన్నపిల్లల ఆసుపత్రిలో చేపట్టిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆరోగ్యం అనేది ప్రతి మనిషికి అత్యంత విలువైన సంపద అని, ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. డాక్టర్ మాసిలామణి ప్రజలకు అందిస్తున్న ఆరోగ్యసేవలను ఎమ్మెల్యే ప్రశంసించారు. ప్రజల్లో ఆరోగ్యం పట్ల చైతన్యాన్ని పెంచేందుకు, గ్రామీణ ప్రాంతాల్లో కూడా నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని


పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

కొనియాడారు. శిబిరానికి వచ్చిన రోగులకు, ప్రజలకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు.

# ఏఎస్‌పేటకి.. సాగునీటి భరోసా!

## మంత్రి ఆనం చొరవతో 3.87 కోట్ల కేటాయింపు



రాష్ట్ర దేవాదాయమంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రత్యేకచొరవతో జిల్లాలోని మెట్ట ప్రాంతమైన ఏఎస్‌పేట (అనుమసముద్రంపేట)కి సాగునీటి భరోసా ఏర్పడింది. గతంలో ఆర్థికమంత్రిగా ఆనం ఉన్నప్పుడు చేసిన పలు ప్రతిపాదనలు మళ్ళీ దాదాపు 16ఏళ్ల తర్వాత ఇప్పటికి సాకారం కానున్నాయి. అప్పట్లోనే ఆయన ఏఎస్‌పేట సాగునీటి రంగానికి ఎలాంటి అభివృద్ధి పనులు చేయించాలో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో,ఆ పనులన్నీ అటకెక్కాయి. ఇప్పుడు వాటిని వెలికితీయించి ఆ పనులు పూర్తిచేయించేందుకు మంత్రి ఆనం సమాయత్తం కావడం విశేషం. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల నుండి కోట్లాది రూపాయల నిధులను ఈ ప్రాంతంలోని చెరువుల మరమ్మతులకు, సాగునీటి పథకాలకు మంత్రి ఆనం కృషితో మంజూరయ్యాయి కూడా. దీంతో ఎంతోకాలం నుంచి సాగునీటి కోసం ఎదురుచూస్తున్న మండల ప్రజలు, రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మొత్తంగా రూ. 3కోట్ల 87 లక్షల రూపాయల నిధులు మంజూరయ్యాయి. ఆ నిధితో ఈ మండలంలోని 13 చెరువుల పునరుద్ధరణ పనులు ప్రారంభం కానున్నాయి. కొండమీద కొండూరు చెరువుకు రూ.12.50 లక్షలు, చౌట భీమవరానికి 23 లక్షలు, పొనుగోడుకు 26 లక్షలు, గుంపర్లపాడుకు 16 లక్షలు, తెల్లపాడుకు 14 లక్షలు, జమ్మవరానికి 21 లక్షలు, శ్రీకొలనుకు 29 లక్షలు, చిన్నబ్బీపురానికి 22.50, కుప్పూరుపాడుకు 31.50, చిరమన పెద్దచెరువుకు 50 లక్షలు, రాజవోలుకు 37, పందిపాడుకు 33.50, గుడిపాడు చెరువుకు 63.50 లక్షల రూపాయల వంతున కేటాయించారు. ఈ పనుల ద్వారా స్థానిక రైతులకు సాగునీటి సౌకర్యం మెరుగుపడటమే కాకుండా, భూగర్భ జలాల మట్టం పెరగడానికి కూడా ఎంతో ఉపయోగపడుతుందని భావిస్తున్నారు.

# చిరస్మరణీయులు.. బాబూ జగజ్జీవన్‌రామ్

**జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ**


బాబూ జగజ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

స్వాతంత్ర్య సమరయోధుడు, భారత ఉప ప్రధాని, సామాజిక న్యాయం కోసం పోరాడిన గొప్ప నాయకుడు బాబూ జగజ్జీవన్‌రామ్ అని, దేశంలోని బడుగు బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికి వారు చేసిన సేవలు చిరస్మరణీయమని జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అన్నారు. జగజ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఇటీవల జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయములో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ, దేశానికి అపారమైన సేవలు అందించిన మహానుభావుడు బాబు జగ్జీవన్ రామ్ అని అంటూ, ఆయనకు నివాళులర్పించారు. వారి ఆశయాలను అందరూ స్ఫూర్తిగా తీసుకుని దేశాభివృద్ధికి కృషిచేయాలని ఆమె పిలుపునిచ్చారు. జడ్పీ ఇన్‌చార్జి సీఇఓ డి. వసుమతి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# సర్పంచ్‌లను సన్మానించిన గిరిధర్‌రెడ్డి


సర్పంచ్‌లని సత్కరిస్తున్న కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి

సర్పంచుల పదవీకాలం ముగిసిన సందర్భంగా గత అయిదేళ్లలో గ్రామాల్లోని ప్రజలకు విశిష్ట సేవలు అందించిన సర్పంచులకు టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి సన్మానాలు నిర్వహించారు. నెల్లూరు రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో ఇటీవల కొత్తగా నియమితులైన స్పెషల్ ఆఫీసర్‌లతో మండల పరిషత్ అధ్యక్షుడు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన పాల్గొని సర్పంచ్‌ల సేవలను కొనియాడారు. నెల్లూరురూరల్ నియోజకవర్గం అభివృద్ధి, సంక్షేమం రెండు రెండు కళ్ళులా సాగుతున్నాయని, గ్రామాలలో ఎక్కడా కూడా ఘర్షణలు లేకుండా, కలిసికట్టుగా గ్రామాల అభివృద్ధి జరుగుతుందని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సారథ్యంలో ఈ నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా కోట్లాదిరూపాయలు వ్యయమయ్యే అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు

## జగ్జీవన్‌రామ్‌కి టీడీపీ నేతల నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర

బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం తపించిన గొప్ప వ్యక్తి బాబూ జగ్జీవన్‌రామ్ అని టీడీపీ నాయకులు కొనియాడారు. జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఈనెల 5న నెల్లూరులోని వేదాయ పాళెం సెంటర్ వద్ద ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహానికి వారు పూలమాలలు సమర్పించి ఆయన సేవలను జ్ఞాపకం చేసుకున్నారు. సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, నెల్లూరు పార్లమెంట్ టిడిపి ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, ఎస్సీ కమీషన్ సభ్యులు శ్రీపతిబాబు, రాష్ట్ర కార్యదర్శి జెన్ని రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## జూనియర్ సివిల్ జడ్జిగా.. కృష్ణప్రియాంక



కృష్ణ ప్రియాంకని అభినందిస్తున్న 'ఐలు' సభ్యులు

నెల్లూరు బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది పీసీ కృష్ణయ్య చిన్న కుమార్తె.. కుమారి కృష్ణ ప్రియాంక దేవి జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపిక కావడం పట్ల న్యాయవాదులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆయన పెద్ద కుమార్తె పూర్ణిమ కూడా ప్రసుతం చిత్తూరు జిల్లాలో జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్నారు. వీరి మరొక సోదరి నెల్లూరు బార్ అసోసియేషన్‌లో న్యాయవాది.

### ఐలు అభినందన :

జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన పీసీ కృష్ణప్రియాంకా దేవికి ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) జాతీయ కమిటీ సభ్యులు..రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ అంకయ్య అభినందించారు. ఈ కార్యక్రమంలో ఐలు జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్కా రమేష్, కార్యదర్శి సాయికుమార్, న్యాయవాదులు ఐ.శ్రీనివాసులు, షేక్ షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీధరన్న రూటే..సపరేటు!

### - - - కొనియాడిన ఎమ్మెల్యే సునీల్ - - -



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధరన్న రాజకీయాలు కానీ, ఆయన ప్రజాప్రతినిధులను ఆదరించే తీరు కానీ అద్భుతమని, రాజకీయాల్లో ఆయన రూటే సపరేటని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ కొనియాడారు. ఇటీవల ఆయన నెల్లూరు రూరల్‌లోని 3 డివిజన్లలో 1కోటి 5 లక్షల రూపాయల అభివృద్ధి పనులను నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డితో కలసి ప్రారంభించారు. 20వ డివిజన్, హనుమాన్ జంక్షన్ వద్ద 20, 21, 22, 23 డివిజన్లలో 1 కోటి 5 లక్షల రూపాయల అభివృద్ధి పనులను ప్రారంభించిన గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మరియు టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డిలు ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ఏ శాసనసభ్యుడు కూడా ఇతర ఎమ్మెల్యేలను తమ నియోజకవర్గాలకు పిలవరని, అలాంటిది తమను పిలిచి అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేయించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అంతేకాదు, రాష్ట్రంలో ఏ ఎమ్మెల్యే కూడా చేయని విధంగా 339 అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి, 60రోజుల్లో పూర్తిచేసిన ఏకైక నాయకుడు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అని ప్రశంసించారు. శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ, నెల్లూరు రూరల్ నియోజకవర్గం రోజురోజుకి వేగంగా విస్తరిస్తోందని, మూడవసారి తాను వేలకోట్ల కోటీశ్వరుడి మీద పోటీ చేసినప్పుడు రూరల్ ప్రజలు తనను ఆశీర్వదించి భారీ మెజారిటీతో గెలిపించారని అన్నారు. నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సహకారంతో కొండాయపాలెం గేట్, బి వి నగర్ అండర్ బ్రిడ్జీలు సాకారమవుతున్నాయని సంతోషం వ్యక్తం చేశారు.

## కాత్యాయనీ వ్రతం

నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరిదేవి ఆలయంలో ఈనెల 7న కాత్యాయనీ వ్రతం జరిగింది. అనిశెట్టి మండపంలో అమ్మవారికి ప్రత్యేకంగా పూల అలంకారం చేసి, ఈ వ్రతాన్ని నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్-కార్యనిర్వహణాధికారి కోవూరు జనార్దన్‌రెడ్డి, ఆలయ ఛైర్మెన్ ఏలూరు శిరీష, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ ప్రధాన అర్చకులు, సిబ్బంది పర్యవేక్షించారు. ఈ వ్రతం వల్ల వధూవరులకు జాతకరీత్యా కుజదోషం, కాలసర్ప దోషాలు తొలగిపోయి వివాహం జరుగతుందని, స్త్రీలు సౌభాగ్యం కోసం, ఆయురారోగ్యాల కోసం, అన్యోన్య దాంపత్యం కోసం ఈ వ్రతం చేసుకోవచ్చని నిర్వాహకులు తెలిపారు.

## 'డా.కిషోర్స్ రత్నం'లో..

## వైజ్ఞానిక ప్రదర్శన




సైన్స్ చిల్డ్రన్ కాన్ఫరెన్స్‌ని ప్రారంభిస్తున్న ముఖ్యఅతిథులు

నెల్లూరు సరస్వతినగర్‌లోని డా.కిషోర్స్ రత్నం హైస్కూళ్ల విద్యార్థులు ఇటీవల సైన్స్ చిల్డ్రన్ కాన్ఫరెన్స్ పేరుతో చేపట్టిన వైజ్ఞానిక ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. జిల్లా సైన్స్ మ్యూజియం ఇన్‌చార్జి ఎన్.శివారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ఈ ప్రదర్శన ప్రారంభించారు. శాస్త్రీయ దృక్ఫథంతో సుమారు 150 సైన్స్ నమూనాలను విద్యార్థులు ప్రదర్శించడం ప్రశంసనీయమని ఆయన అన్నారు. శాస్త్రీయ ఆలోచనా దృక్పథంతో విద్యార్థులను ప్రోత్సహిస్తున్న డా. కిషోర్స్ రత్నం విద్యాసంస్థల యాజమాన్యాన్ని అభినందించారు. డా.కిషోర్‌స రోషిణి రత్నం మెడికల్ ఒలంపియాడ్, రత్నం టెక్నో ఇఐటి, రత్నం ఎలైట్ ఒలంపియాడ్ హైస్కూల్స్ విద్యార్థులు ఈ ప్రదర్శనలను ప్రతిభావంతంగా రూపుదిద్దారు. విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, జూనియర్ మేనేజర్ అజయ్‌సింగ్, ఏఓ తుహీన, ప్రిన్సిపాల్స్ మణిమాల, జ్యోతి, ప్రపూర్ణ తదితరులు పర్యవేక్షించారు.

## ఫ్రెండ్స్ వాకర్స్.. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం



వాకర్స్‌కి అవగాహన కలిగిస్తున్న డాక్టర్ కె.శ్రీరామ్‌కుమార్

నెల్లూరు ఏసీ స్టేడియంలోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పై ఇటీవల అవగాహన సదస్సు జరిగింది. సంకల్ప హాస్పిటల్ అధినేత డాక్టర్ కె.శ్రీరామ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 2026 అంతర్జాతీయ ఆరోగ్య సూత్రమైన 'అందరూ ఐకమత్యంగా ఉండాలి-సమాజం ఆరోగ్యంగా ఉండాలి' అనే అంశంపై సందేశం ఇచ్చారు. ఎండాకాలంలో ఆరోగ్యం దెబ్బతినకుండా, తీసుకోవలసిన జాగ్రత్తలను ఆయన వివరించారు. ఏదైనా వ్యాధి సోకినప్పుడు వెంటనే డాక్టర్లను సంప్రదించి తగు జాగ్రత్తలు తీసుకోవడం చాలా ముఖ్యమైనదన్నారు. షుగర్, బీపీ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. వాకర్స్-203 గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు, అసోసియేషన్ అధ్యక్షులు షేక్ నసీర్‌అహ్మద్, కార్యదర్శి శానంపూడి సుబ్బరాయుడు, గౌరవ అధ్యక్షులు బిరుదవోలు రామ్మోహన్‌రెడ్డి, ఆర్‌సీ పలగాటి శ్రీనివాసులురెడ్డి, పత్తిపాటి రమణయ్య, లక్కాకుల శ్రీనివాసులు, వినుకొండ వెంకటేశ్వర్లు, చెంచయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.




అశ్రునివాళి

మా ఇంటి ఆడపడుచు
కర్ణాటక సంగీత విద్వాంసురాలు
శ్రీమతి దుర్భా రాజ్యలక్ష్మి
ఆకస్మిక మరణానికి చింతిస్తూ...
ఆమె ఆత్మకు మోక్షప్రాప్తి కలగాలని
భగవంతుడిని ప్రార్థిస్తున్నాము.

శోకతప్త హృదయాలతో...

అన్న: డాక్టర్ మర్మావుల సుబ్రహ్మణ్యం - శ్రీమతి ఎమ్.రజని
విశ్రాంత ప్రిన్సిపాల్, వి.ఆర్.కళాశాల, నెల్లూరు.

ఎమ్.రామచంద్ర కాశ్యప్ - ఎమ్.వి.ఎన్.నిఖిత
ఎమ్.సహస్ర చెంగమణి యు.ఎస్.ఏ.

ఎమ్.అనన్య భార్గవి - టి.నందజ్ఞాన్
టి.శ్రీదేవి యు.ఎస్.ఏ.


## సైనిక సంక్షేమానికి..జడ్పీటీసీల వితరణ



జిల్లా సైనిక సంక్షేమాధికారికి విరాళం చెక్కును అందజేస్తున్న జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

సైనికుల సంక్షేమం కోసం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ప్రజా పరిషత్ పాలకవర్గంలోని అధ్యక్షులు మరియు జెడ్.పి.టి.సి సభ్యులు స్వచ్ఛందంగా సమకూర్చిన లక్షా 82వేలా నూటపదహారు రూపాయల విరాళాన్ని ఈనెల 6న జిల్లా సైనిక సంక్షేమాధికారికి అందజేశారు. ఈ సందర్భంగా జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ, దేశ రక్షణ కోసం, ప్రజల భద్రత కోసం సైనికులు చేస్తున్న త్యాగాలు అపూర్వమన్నారు. ప్రతి పౌరుడు ప్రతి సంవత్సరం తనకు తోచినంత ఆర్థిక సహాయాన్ని సైనిక సంక్షేమానికి స్వచ్ఛందంగా అందించడాన్ని ఒక బాధ్యతగా భావించాలని ఆమె కోరారు. అత్యధిక విరాళం అందచేసిన అనంతసాగరం మండలం జెడ్.పి.టి.సి. సభ్యులు రాపూరు వెంకట సుబ్బారెడ్డికి ఆమె ధన్యవాదాలు తెలియజేశారు. తనవంతు సాయాన్ని అందించడమే కాకుండా మరో నలుగురు బంధుమిత్రుల వద్ద నుండి స్వచ్ఛందగా విరాళం అందించిన ఆత్మకూరు జడ్పీటీసీ సభ్యురాలు పెమ్మసాని ప్రసన్నలక్ష్మికి ఆమె ధన్యవాదాలు తెలియజేశారు. గూడూరు జడ్పీటీసీ సభ్యురాలు ఊటుకూరు యామిని, జిల్లా ప్రజా పరిషత్ సీఇఓ శ్రీధర్‌రెడ్డి, జిల్లా సైనిక్ సంక్షేమ అధికారి పాల్గొన్నారు.

# 'జల సిరి'తోనే..ప్రజలకు సిరి!

## మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



గంగమ్మకు సారెను సమర్పిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

జలాలను పరిరక్షించుకుంటూ, రైతులు పంటపొలాలు సాగు చేసుకోవాలని, జలసిరితోనే ప్రజలకు అసలైన సిరి అని రాష్ట్ర దేవాదాయమంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. ఈనెల 6న ఆత్మకూరు నియోజకవర్గంలోని సంగం మండలం గాంధీజనసంఘం వద్ద రైతుల ఆనందోత్సాహాల మధ్య ఆయన 'జలసిరి పండుగ' నిర్వహించారు. గంగమ్మ తల్లికి చీర సారె సమర్పించిన అనంతరం రూ. 84.75 లక్షలతో కనిగిరి రిజర్వాయర్ మెయిన్ కెనాల్‌లో పూడికతీత పనులను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా సంఘం బ్యారేజ్ సమీపంలో నిర్వహించిన సభలో మంత్రి ఆనం మాట్లాడుతూ, 'ప్రతి నీటిబొట్టును ఒడిసి పట్టుకుంటాం... రైతన్నకు తోడుగా ఉంటాం' అన్నారు. జల వనరుల సంరక్షణే ప్రధాన లక్ష్యంగా వంద రోజుల ప్రణాళికతో "జలసిరి" కార్యక్రమాన్ని ఆత్మకూరు నియోజకవర్గంలో ప్రారంభించామన్నారు. జిల్లాలో కాలువలు, చెరువుల పూడికతీత, పంట కాలువల అభివృద్ధి వంటి 1979 పనులకు రూ. 62 కోట్లు మంజూరు చేయగా, ఆత్మకూరుకు రూ. 12 కోట్లు కేటాయించామని తెలిపారు. ఈనెల 15వ తేదీ వరకు అవసరమైన పనులను గుర్తించి, 70 రోజుల్లో పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. సోమశిల, కండలేరు జలాశయాల్లో నీటిని సమృద్ధిగా నిల్వ ఉంచితే మూడు సంవత్సరాలపాటు సాగు, తాగునీటికి ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. సోమశిల ఉత్తర, దక్షిణ కాలువల అభివృద్ధికి నిధులు మంజూరుచేసి, ఉత్తర కాలువ ద్వారా రాళ్లపాడు వరకు నీటిని అందిస్తున్నామని తెలిపారు. సంగం బ్యారేజ్ రోడ్డు బ్రిడ్జి నిర్మాణానికి సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు వెల్లడించారు.

## జువ్వలదిన్నె హార్బర్‌పై..

# తప్పుడు ప్రచారం చేయొద్దు

### ○ వైసీపీ నేతలకు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి హితవు

మత్స్యకారుల వేటకు ఇబ్బందులు లేకుండా జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ ఎంతో ఉపయోగపడుతుందని, అయితే దానిపై వైసీపీ నాయకులు లేనిపోని విమర్శలు చేయడం మంచిది కాదని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఇటీవల ఆయన తన సతీమణి.. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డితో కలసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జువ్వలదిన్నెలో సాగర్ డిఫెన్స్ కంపెనీ ఏర్పాటును కూడా వైసీపీ నాయకులు రాజకీయం చేస్తున్నారని, అనవసరమైన అపోహలు సృష్టిస్తూ మత్స్యకారులను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారని వారన్నారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌లో సముద్రం వైపు 150 మీటర్ల వెడల్పుతో భూమి కంపెనీ వారికి ఇచ్చారని, దానికి కూడా వైసీపీ నేతలు అపోహలు సృష్టించారన్నారు. అయితే, వాస్తవానికి మత్స్యకారులకు ఎక్కడా నష్టం జరగదన్నారు. సాగర్ డిఫెన్స్ కంపెనీ పరికరాలు డ్రోన్ల ద్వారా ఇంకా మత్స్యకారులకే అధిక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. మత్స్యకారులకు ఎక్కడ వేట బాగా దొరుకుతుందన్న సమాచారం కూడా అందుతుందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా హై స్పీడ్ బోట్ల కొనుగోలుకు మహిళలకు దాదాపు 65 శాతం రాయితీ ఉంటుందని స్పష్టం చేశారు. ఇప్పటికే రెండు హై స్పీడ్ బోట్లు ఇచ్చారని, మరో 4 బోట్లు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. వైసీపీ నాయకులు ఎప్పుడూ మత్స్యకారులకు అండగా లేరని అన్నారు. ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ, మత్స్యకారుల ప్రయోజనాలు కాపాడటమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి





# సంస్మరణ

మా ఇంటి దైవం, మా అభివృద్ధికి కారకురాలు

## శ్రీమతి కొండా శ్యామలమ్మ గారు

(W/o. లేట్ శ్రీ కొండా కోటారెడ్డి గారు)

స్వర్గస్తులై తేది. 10.04.2026 శుక్రవారమునకు పదమూడు సంవత్సరములు నిండుతున్న సందర్భముగా ఆమె దివ్యస్మృతిని స్మరించుకుంటూ...

వారి పవిత్రాత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ..

శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము.

కుమారులు - కోడళ్ళు

కొండా చంద్రమోహన్‌రెడ్డి - స్వర్ణలత

కొండా రవీంద్రరెడ్డి - అరుణ

మనుమలు, మనుమరాండ్రు, మునిమనుమలు, మునిమనుమరాలు

దామరమడుగు గ్రామం, బుచ్చిరెడ్డిపాళెం మండలం.



శ్రీమతి కొండా శ్యామలమ్మ గారు

దామరమడుగు

# అమరావతి అంటే..
# అయిదు కోట్ల ఆంధ్రుల ఆత్మగౌరవం
## ఎన్జీఓల సంఘం నేత..బండారు



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ జేఏసీ చైర్మన్ బండారుపల్లి వెంకటేశ్వర్లు

అమరావతి అంటే అయిదు కోట్ల ఆంధ్రుల ఆత్మగౌరవమని, అమరావతికి చట్టబద్ధత రావడం ఆంధ్రుల ఆశయాలకు గెలుపని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా అధ్యక్షులు మరియు ఏపీ జేఏసీ చైర్మన్ బండారుపల్లి వెంకటేశ్వర్లు చెప్పారు. ఈ నిర్ణయం రాష్ట్ర చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయమని ఆయన కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ మళ్ళీ తన పూర్వ వైభవాన్ని సంతరించుకుంటుందన్నారు. అదేవిధంగా, ఉద్యోగులకు రావలసిన పెండింగ్ బకాయిలలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం 1500 కోట్లు విడుదల చేయడం హర్షదాయకమన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర జేఏసీ చైర్మన్ అలపర్తి విద్యాసాగర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.వి.రమణ, రాష్ట్ర జేఏసీ సెక్రటరీ జనరల్ కె.ఎస్.ఎస్ ప్రసాద్ లకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.కిరణ్‌కుమార్, జిల్లా కార్యదర్శి రామకృష్ణ, సహాధ్యక్షులు ఆంజనేయవర్మ, కార్యనిర్వాహక కార్యదర్శి పెంచలయ్య, ఉపాధ్యక్షులు రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# జగ్జీవన్‌రామ్ ఆశయాలను సాధించాలి



జగ్జీవన్‌రామ్‌కి నివాళులర్పిస్తున్న మంద బాబ్జీ

భారతదేశ ఉప ప్రధాని స్వర్గీయ బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయాలను సాధించాలని జిల్లా ఎస్సీఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు మంద బాబ్జీ కోరారు. ఈనెల 5న జగ్జీవన్‌రామ్ 119వ జయంతి సందర్భంగా నెల్లూరు, వేదాయపాళెంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు వాదనాల విజయ్‌కుమార్, కె ప్రభాకర్, మనోజ్ కుమార్, పాలకీర్తి శ్రీనివాసులు, మల్లెల రవి వందనం, గొల్లపల్లి శ్రీనివాసులు, అరవ శౌరి, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరిస్తున్న మేజిస్ట్రేట్ భరద్వాజ్

# జొన్నవాడ క్షేత్రాన్ని
# దర్శించుకున్న మేజిస్ట్రేట్

నెల్లూరు జిల్లా ఫస్ట్ అడిషనల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ పి.భరద్వాజ్ ఈనెల 5న కుటుంబసభ్యులతో బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని జొన్నవాడ క్షేత్రానికి వచ్చి శ్రీ మల్లికార్జునస్వామి-కామాక్షితాయి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు వారిని ఆలయ మర్యాదలతో స్వాగతించి దైవదర్శనం కల్పించారు. అనంతరం అర్చకులు స్వామివార్ల శేష వస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందించి, వేదాశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మెన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, కార్యనిర్వహణాధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సాయిదర్బార్‌లో రక్తదానం



రక్తదానం చేస్తున్న యువకులు

నెల్లూరు పద్మావతినగర్‌లో ఉన్న శ్రీ సాయిదర్బార్ అద్దాల మందిరంలో ఈనెల 5న స్వచ్ఛంద రక్తదానం కార్యక్రమం నిర్వహించారు. మాధవసేవ-మానవసేవ చేయాలన్న బాబా సూక్తులను అనుసరిస్తూ, మందిరం వారు నిర్వహిస్తున్న సామాజిక సేవలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో అనేకమంది రక్తదాతలు పాల్గొని రక్తదానం చేశారు. యువ సేవాదళ్ సభ్యుడు స్వర్గీయ కనుమూరు సాయినాథ్‌రెడ్డి జ్ఞాపకార్థం చేపట్టిన ఈ శిబిరంలో నోవా బ్లడ్‌బ్యాంక్ బృందం వారు పాల్గొని 77 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. రక్తదానం చేసిన దాతలకు శ్రీ సాయినాథుని దివ్య ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని మందిర చైర్మన్ మధుసాయి ఆకాంక్షించారు. మందిరం గౌరవ సలహాదారు పాబోలు రామసుబ్బయ్య, నోవా బ్లడ్‌బ్యాంక్ ఆర్గనైజర్ బావిశెట్టి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



# పొట్టేపాళెం..కోదండరామునికి విశేష పూజలు

శ్రీరామనవమిని పురస్కరించుకుని నెల్లూరు రూరల్ మండలం పొట్టేపాళెం గ్రామంలో ఉన్న శ్రీ కోదండరామస్వామి దేవాలయంలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. గతనెల 27 నుంచి ఈ నెల 8వతేదీ వరకు ప్రతిరోజూ స్వామివారికి ప్రత్యేక వాహనసేవలు చేశారు. ఈనెల 5న ఉభయ కర్తలు పొన్నాల వెంకటశేషురెడ్డి, పొన్నాల రామచంద్రారెడ్డి, అఖిలేష్‌రెడ్డిల ఆధ్వర్యంలో స్వామివారి గజవాహనోత్సవం నేత్రపర్వంగా సాగింది. 13రోజుల పాటు అంగరంగవైభవంగా జరిగిన శ్రీరామనవమి వేడుకల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివార్ల ఉత్సవాలను తిలకించి తరించారు.

# కర్ణాటక సంగీత గాయని.. దుర్భా రాజ్యలక్ష్మి ఇక లేరు!



నెల్లూరు నగరానికి చెందిన ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసురాలు దుర్భా రాజ్యలక్ష్మి ఈనెల 2వ తేదీన కాలధర్మం చెందారు. ఆమె వయసు 61 సంవత్సరాలు. ఆమెకు భర్త దుర్భా జనార్దన్, కుమారుడు-కుమార్తె ఉన్నారు. చిన్న వయసు నుండీ శాస్త్రీయ సంగీతంపై ఆమెకు మక్కువ ఎక్కువ. తల్లిదండ్రులు కీ॥శే॥ మర్మాపుల వసుంధర దేవి - రామయ్యల ప్రోత్సాహంతో ప్రముఖ శాస్త్రీయ సంగీత విద్వాంసులు బండ్లమూడి రామనాథ శర్మ వద్ద ఆమె సంగీతం అభ్యసించారు. ఆ తర్వాత 2010లో తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం నుండి సంగీతంలో ఎం.ఎ. డిగ్రీ పొందారు. ప్రతి సంవత్సరం నెల్లూరులో వైభవంగా జరిగే శ్రీ త్యాగరాజ స్మరణోత్సవ కార్యక్రమాలలో రాజ్యలక్ష్మి 1982వ సంవత్సరం నుండి తన గాత్ర కచ్చేరీతో ప్రేక్షకులను ఆకట్టుకునేవారు. డాక్టర్ సి.నారాయణరెడ్డి, ఎస్.జానకి, గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తదితర ప్రముఖుల నుండి సత్కారాలు పొందారు. ఆకాశవాణి హై గ్రేడ్ ఆర్టిస్ట్‌గా రేడియోలో చాలాసార్లు పలు గీతాలను గానం చేశారు. తిరుమలలో జరిగే నాదనీరాజనం కార్యక్రమాలలో పాల్గొన్నారు. నెల్లూరులోని సింహపురి సంగీత సభ, కళాంజలి, అన్నమాచార్య ఆరాధనా సమితి తదితర సాంస్కృతిక సంస్థల నుండి ఆమె అవార్డులు స్వీకరించారు. వీ.ఆర్.కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యంకు ఆమె స్వయానా చెల్లెలు. మురళీకృష్ణ హోటల్స్ వీరిశెట్టి హజరత్‌బాబు, త్యాగరాజ స్మరణోత్సవ కమిటీ కార్యదర్శి డాక్టర్ వై. నాగదేవీప్రసాద్, కళాంజలి అనంత్, చేతన కార్యదర్శి శేషగిరీశం, సంగీత విద్వాంసులు డీ.వీ.సురేష్ రావు, జే.బాలార్క, లక్ష్మీప్రసన్న, హేమలక్ష్మి, త్యాగరాజ స్మరణోత్సవ కమిటీ సభ్యులు ఆమె పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆమె మృతికి చింతిస్తూ.. వారి కుటుంబసభ్యులకి ప్రగాఢ సంతాపాన్ని తెలుపుతోంది 'లాయర్'.

# 'ప్రశ్న'లే..ప్రగతికి ప్రధాన ద్వారాలు!

జ్ఞాన నేత్రం
డా. నరసింహారెడ్డి ఊరిమిండి
Dallas, Texas, USA

విజ్ఞానం అనేది కేవలం ప్రయోగాల సమాహారం కాదు; అది మనసు పని చేసే ఒక ప్రత్యేక విధానం. ప్రపంచాన్ని ఎలా చూస్తామో, ఒక సమస్యను ఎలా అర్థం చేసుకుంటామో, ఒక సందేహాన్ని ఎలా విచారిస్తామో- ఇవి అన్నీ విజ్ఞానాత్మక ఆలోచనలో భాగాలు. ఈ ఆలోచనకు మూలం ఒకేఒక శక్తి.. సరైన ప్రశ్నలు అడగడం.

"అడిగితే అమృతం, అడగకపోతే విషం" అనే లోకోక్తి విజ్ఞానానికి మరింత సరిగ్గా సరిపోతుంది. ప్రశ్న అడగడం అంటే కేవలం సమాధానం కోసం ఎదురు చూడటం కాదు; అది మనసును తెరవడం, కొత్త దారులు వెతకడం, తెలియని విషయాన్ని తెలుసుకోవాలనే తపనను వెలిగించడం అని గుర్తుంచుకోవాలి. విజ్ఞాన శాస్త్రం మొత్తం ప్రశ్నల మీదే నిలబడి ఉంది. న్యూటన్‌కు ఆపిల్ కిందపడినప్పుడు వచ్చిన ప్రశ్న, ఐన్‌స్టీన్‌కు సమయం అంటే ఏమిటి అనే సందేహం, మేరీ క్యూరీకి పదార్థం లోపల దాగి ఉన్న శక్తి గురించి కలిగిన ఆసక్తి.. ఇవన్నీ అలాంటి ప్రశ్నలే. ఆ ప్రశ్నలే ప్రపంచాన్ని ముందుకు నడిపించాయి. ప్రశ్నలే ప్రగతికి ప్రధాన ద్వారాలుగా నిలిచాయి. మన విద్యార్థులు కూడా ఇదే శక్తిని పెంచుకోవాలి. కానీ, చాలాసార్లు పాఠశాలల్లో ప్రశ్నలు అడగడం కంటే సమాధానాలు చెప్పడానికే ప్రాధాన్యం ఇస్తారు. పరీక్షల్లో మార్కులు తెచ్చే సమాధానాలు నేర్పుతారు, కానీ ఆ సమాధానాల వెనుక ఉన్న ప్రశ్నలను ఆలోచించే అవకాశం ఇవ్వరు.

## ప్రశ్నలతోనే..విజ్ఞాన యానం

"ప్రశ్నించని మనసు పురోగతి చూడదు" అని తెలుసుకోవాలి. విజ్ఞానాత్మక ఆలోచన అంటే సమాధానాలను కంఠస్థం చేయడం కాదు; ప్రశ్నలను అర్థం చేసుకోవడం. ఒక విద్యార్థి "ఇది ఎందుకు జరుగుతుంది?", "ఇది ఇలా కాకపోతే ఏమవుతుంది?", "దీనికి మరో మార్గం ఉందా?" అని ఆలోచించడం ప్రారంభించిన క్షణం నుంచే అతని విజ్ఞానయానం మొదలవుతుంది. ప్రశ్నలు అడగడం అనేది ధైర్యం. ఎందుకంటే ప్రశ్న అడిగినప్పుడు మన అజ్ఞానం బయటపడుతుందేమో అనే భయం ఉంటుంది. కానీ "తెలియనిదే తెలుసుకోవడానికి మొదటి అడుగు" అని గుర్తుంచుకుంటే, ఆ భయం కరుగుతుంది. సరైన ప్రశ్నలు అడగడం కూడా ఒక కళ. అది ఒక్కరోజులో రాదు. ఒక మంచి ప్రశ్న అనేది సమస్యను చిన్న చిన్న భాగాలుగా విభజించి, దాని గుండెను తాకేలా ఉండాలి. ఉదాహరణకు, ఒక మొక్క ఎందుకు పెరుగుతుంది అని అడగడం ఒక ప్రశ్న. కానీ "మొక్క పెరుగుదలలో కాంతి పాత్ర ఏమిటి?", "నీటి పరిమాణం మారితే పెరుగుదల ఎలా మారుతుంది?", "మట్టిలోని ఖనిజాలు ఏ విధంగా ప్రభావితం చేస్తాయి?" అని అడగడం విజ్ఞానాత్మక ప్రశ్న. ఈ తేడా విద్యార్థి ఆలోచనా లోతును నిర్ణయిస్తుంది. "లోతుగా ఆలోచించినవాడే లోకాన్ని మార్చగలడు" అనే సత్యం విజ్ఞానంలో మరింత స్పష్టంగా కనిపిస్తుంది. ప్రశ్నల లోతు పెరిగినప్పుడు, సమాధానాల నాణ్యత కూడా పెరుగుతుంది. ఈ ప్రపంచం ముందుకు సాగింది సమాధానాల వల్ల కాదు..ప్రశ్నల వల్లే. ప్రశ్నించే మనసు ఉన్నచోటే కొత్త ఆవిష్కరణలు పుడతాయి, కొత్త దారులు తెరుచుకుంటాయి. "ప్రశ్నే పురోగతికి పునాది" అనే మాట విజ్ఞానశాస్త్రం మొత్తం నిలబెట్టే సత్యం.

## విజ్ఞానాత్మక ఆలోచనలే పురోగతికి మూలాధారాలు

విజ్ఞానాత్మక ఆలోచనలో మరో ముఖ్యమైన అంశం..సందేహాన్ని స్వీకరించడం. మనం తరచూ సందేహాన్ని బలహీనతగా భావిస్తాం. కానీ, విజ్ఞానంలో సందేహమే బలం. సందేహం లేకపోతే పరిశోధన ఉండదు. పరిశోధన లేకపోతే పురోగతి ఉండదు. "సందేహమే సత్యానికి ద్వారం"అనే లోకోక్తి విజ్ఞానానికి అచ్చం సరిపోతుంది. ఒకవిద్యార్థి"ఇది నిజమేనా?" అని ప్రశ్నించినప్పుడు, అతను పుస్తకాన్ని కాదు, ప్రపంచాన్ని ప్రశ్నిస్తున్నాడు. ఆ ప్రశ్నే అతన్ని పరిశీలన వైపు నడిపిస్తుంది. పరిశీలన అతన్ని ప్రయోగాల వైపు తీసుకెళ్తుంది. ప్రయోగాలు అతన్ని నిజానికి దగ్గర చేస్తాయి. ఈ ప్రయాణం మొత్తం ఒక చిన్న సందేహంతోనే మొదలవుతుంది.ప్రశ్నలు అడగడం అంటే గురువును పరీక్షించడం కాదు; మనసును విస్తరించడం. గురువులు కూడా విద్యార్థుల ప్రశ్నలను అడ్డుకోవడం కాదు, ప్రోత్సహించాలి. ప్రశ్న అడిగిన విద్యార్థిని "ఎందుకు ఇలా ఆలోచించావు?" అని అడిగితే, అతని ఆలోచన మరింత లోతుగా మారుతుంది. తరగతి గదిలో ప్రశ్నలు అడగడానికి అనువైన వాతావరణం ఉంటే, విద్యార్థులు విజ్ఞానానికి భయపడరు. వారు దానిని అన్వేషిస్తారు. "మాటలే మానవుని మిత్రులు" అన్నట్లు, విజ్ఞానంలో కూడా మాటలే మార్గం చూపుతాయి. ప్రశ్నల రూపంలో వచ్చే మాటలు మనసును కొత్త దారుల్లో నడిపిస్తాయి.

విజ్ఞానాత్మక ఆలోచనలో మరో ముఖ్యమైన అంశం.. సమాధానాన్ని వెంటనే అంగీకరించకపోవడం. ఒక సమాధానం వచ్చిన వెంటనే 'ఇది సరైనదని ఎలా చెప్పగలం?", "దీనికి ఆధారం ఏమిటి?", "ఇది తప్పు కావచ్చా?" అని ఆలోచించడం విజ్ఞానాత్మక దృక్పథం. ఇది అనుమానం కాదు; ఇదొక పరిశీలన. ఇలాంటి ఆలోచనలు జీవితానికి కూడా వర్తిస్తాయి. సరైన ప్రశ్నలు అడగడం.. మన నిర్ణయాలను స్పష్టం చేస్తుంది. ఒక సమస్యను ఎదుర్కొన్నప్పుడు "ఎందుకు జరిగింది?" అని మాత్రమే కాదు, "అది మళ్లీ జరగకుండా ఎలా చూడాలి?", "అసలు అది జరిగేందుకు కారణమైన మూలం ఏమిటి?" అని ఆలోచించడం.. పరిష్కార దిశగా నడిపిస్తుంది. విజ్ఞానం మనకు నేర్పేది కేవలం ప్రయోగాలు కాదు; ఆలోచన, పరిశీలన, సహనం, నిజాన్ని వెతికే పట్టుదల. ఇవన్నీ జీవితాన్ని ముందుకు నడిపించే శక్తులుగా మనం తెలుసుకోవాల్సి ఉంది.



**వచ్చే వారం:** అధిక మార్కులు తెచ్చే సమాధానాల రహస్యం!

E-mail: reddyu@gmail.com

# ఎన్‌బీకెఆర్‌లో.. మొక్కలు నాటిన విద్యార్థులు



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో ఇటీవల విద్యార్థులు మొక్కలు నాటారు. అనంతరం ధ్యానసాధన చేశారు. 10-ఏ నావెల్ యూనిట్ ఎన్‌సిసి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులంతా ఉత్సాహంగా పాల్గొన్నారు. యోగా క్లబ్ తరపున రామభాగ్య పర్యవేక్షణలో ధ్యాన సాధన జరిగింది. మెడిటేషన్ ప్రాక్టీషనర్ కె.విజయభాస్కర్‌రెడ్డి పాల్గొని, ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, ఒత్తిడి నియంత్రణ సాధ్యమని తెలియజేశారు. ముఖ్యఅతిథులుగా డా. జి.హరినాథ్‌రెడ్డి (డీన్, స్టూడెంట్ అఫైర్స్), డా. పి.శ్రీహరిరెడ్డి (మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి), డా. పి.వి.సుబ్బారెడ్డి (సివిల్ ఇంజినీరింగ్) పాల్గొని విద్యార్థులతో మొక్కలు నాటించారు. 'ఒక చెట్టు-ఒక జీవితం' అనే భావనతో ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డా. వి.మల్లికార్జునరెడ్డి, అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్లు శోభారాణి, పి.రాముకుమార్, ఎన్‌సిసి కేడెట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న టెక్నికల్ ఫెస్ట్...

ఎన్‌బికెఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో, డిపార్ట్‌మెంటల్ టెక్నికల్ ఈవెంట్ 'టెక్న్యూహ -2026' కార్యక్రమానికి ఇటీవల ప్రారంభోత్సవం జరిగింది. కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్, డీన్‌లు, సిఎస్‌ఇ, ఇతర విభాగాల అధిపతులు, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ టెక్నికల్ ఫెస్ట్ విద్యార్థులను బాగా ఆకట్టుకుంది. పేపర్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్, స్పాట్ ఈవెంట్స్ వంటి పలు రకాల ఈవెంట్లను నిర్వహించారు. అనంతరం విజేతలకు ముఖ్య అతిథులు బహుమతులు అందజేశారు.

# నైతిక విలువలే పునాదిగా విద్యా విధానం ఉండాలి

## ఏబీఆర్ఎస్ఎం రాష్ట్ర కార్యవర్గ సమావేశాల్లో వక్తలు



జ్యోతిప్రజ్వలన చేసి సమావేశాలను ప్రారంభిస్తున్న ముఖ్యఅతిథులు

నైతిక విలువలే పునాదిగా విద్యా విధానం ఉండాలని ఇటీవల గూడూరులో జరిగిన ఏబీఆర్ఎస్ఎం (అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్) రాష్ట్ర కార్యవర్గ సమావేశాల్లో వక్తలు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఆ సంస్థ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు గూడూరులోని ఆది శంకర యూనివర్సిటీలో నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి అధ్యక్షునిగా రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ వై.వి.రామిరెడ్డి, ప్రధాన వక్తగా ఆ సంస్థ జాతీయ సహ సంఘటన కార్యదర్శి గుంత లక్ష్మణ్‌జీ, ముఖ్యఅతిథిగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ రాష్ట్ర ప్రచార ప్రముఖ్ మరియు శుభమస్తు షాపింగ్ మాల్ అధినేత బయ్యా వాసు తదితరులు పాల్గొని మాట్లాడారు. అతిథులుగా విక్రమ సింహపురి విశ్వ విద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ శ్రీనివాసరావు, ఏబిఆర్ఎస్ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ డిఎస్‌విఎస్ బాల సుబ్రమణ్యం, అదనపు ప్రధాన కార్యదర్శి డాక్టర్ గుత్తా రాజశేఖర్, మహిళా ప్రముఖ్ ప్రొఫెసర్ పి.శ్రీదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బయ్యా వాసు మాట్లాడుతూ, ఉన్నతమైన విద్య విధానమే దేశ భవిష్యత్తును నిర్ణయిస్తుందని, అందువల్ల నైతిక విలువలతో కూడినటువంటి విద్యా విధానమే దేశ భవిష్యత్తుకు మార్గదర్శకమని సూచించారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా దేశంలోని 145 కోట్ల మంది ప్రజలను పంచ పరివర్తన ద్వారా ఉత్తమమైన పౌరులుగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు. ఏబిఆర్ఎస్ఎం జాతీయ సహ సంఘటన కార్యదర్శి లక్ష్మణ్ మాట్లాడుతూ దేశంలోని విద్యాలయాలన్నింటినీ మాదకద్రవ్యాల రహితంగా మార్చాలన్నారు.

# ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ ముఖ్యం

ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాల పర్యవేక్షణకు నూతనంగా నియమితులైన ప్రత్యేక అధికారులు బాధ్యతా యుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో మండల, అర్బన్ స్థాయి స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు ప్రత్యేక అధికారుల సమీక్ష సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు అందించే సేవలు సమర్థవంతంగా అందుతున్నాయో లేదో ప్రత్యేక అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. డిప్యూటీ సీఈఓ మోహన్‌రావు, శ్రీలక్ష్మి, హిమబిందు, హఫీజ్ పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## బాబు జగ్జీవన్ సేవలు ఎనలేనివి

### - ఎమ్మెల్యే డాక్టర్ పాశిం



మాజీ ఉపప్రధాని, స్వాతంత్ర్య సమర యోధుడు, సంఘసంస్కర్త బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని ఈనెల 5వతేదీ గూడూరు పట్టణం లోని గడియారపు స్తంభం కూడలి వద్ద నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్‌కుమార్ మాట్లాడుతూ దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చేతుల మీదుగా పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అలాగే ఎంపీడీవో కార్యాలయంలో, తహశీల్దార్ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటాలకి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## నేరాలు, ఘోరాలు ఎక్కువయ్యాయి

### ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

టీటీడీ ఛైర్మన్‌గా బీఆర్ నాయుడు బాధ్యతలు తీసుకున్నప్పటి నుండి పవిత్ర పుణ్యక్షేత్రం తిరుమలలో నేరాలు, ఘోరాలు అధికమయ్యాయని ఎమ్మెల్సీ, వైసీపీ గూడూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మేరిగ మురళీధర్ అన్నారు. ఈ నెల 4వ తేదీ గూడూరు సనత్‌నగర్‌లోని వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చరిత్రలో ఎప్పుడూ జరగని విధంగా తొక్కిసలాటలో భక్తులు చనిపోవడం చూశామని, లడ్డూ విషయంలో టీడీపీ నేతలు గందరగోళం సృష్టించి అభాసుపాలయ్యారన్నారు. అసభ్య ప్రవర్తనతో మళ్ళీ వార్తల్లోకి ఎక్కారన్నారు. ఇన్ని జరుగుతున్నా రాష్ట్ర ముఖ్యమంత్రి బీఆర్ నాయుడుపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమన్నారు. వైసీపీ పట్టణాధ్యక్షులు బొమ్మిడి శ్రీనివాసులు, మండల అధ్యక్షులు మల్లు విజయ్‌కుమార్‌రెడ్డి, కోట మండల అధ్యక్షులు పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, వైసీపీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## చిల్లకూరు తహశీల్దార్‌గా గోపినాథ్‌రెడ్డి



గోపినాథ్‌రెడ్డిని సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది

చిల్లకూరు మండల రెవెన్యూ తహశీల్దార్‌గా గతంలో సూళ్ళూరుపేట తహశీల్దార్‌గా పనిచేసిన గోపీనాథ్‌రెడ్డి ఇటీవల బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిల్లకూరు మండలంలో నెలకొని వున్న రెవెన్యూ సమస్యలపై ప్రత్యేకదృష్టి సారిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఓ రమణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## డా. సి.ఆర్.రెడ్డి ఆరోగ్య సంజీవని




పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్న వైద్యులు

ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల జీవన ప్రమాణాలు పెంచడం కోసం ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రతి నెల జరిగే 'డా. సి.ఆర్.ఆర్.రెడ్డి ఆరోగ్య సంజీవని' కార్యక్రమం ఈ నెల 6వ తేదీ గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో జరిగింది. పేద ప్రజల వైద్య దేవుళ్ళుగా పేరొందిన డాక్టర్ సి.ఆర్.రెడ్డి, రోహిణిల సంపూర్ణ సహాయసహకారాలతో 30 మంది ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకి పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్, సూపరింటెండెంట్ జరీనా బేగం, ప్రగతి సేవా కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.



గోడపత్రికలని ఆవిష్కరిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

## బహిరంగ సభను జయప్రదం చేయండి

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రభాకర్

ఈనెల 12వ తేదీన అనంతపురం జిల్లా బండ్లపల్లిలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సి.హెచ్.ప్రభాకర్ పేర్కొన్నారు. అందుకు సంబంధించిన గోడ పత్రికలను ఈ నెల 7వ తేదీ గూడూరు పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్రపన్నుతోందని, జి.రామ్.జి చట్టాన్ని రద్దు చేయాలన్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వం 90 శాతం నిధులు కేటాయిస్తుండగా, 10 శాతం నిధులు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం భరించేదన్నారు. నేడు రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు భరించాల్సి ఉన్నందున, అనేక రాష్ట్రప్రభుత్వాలు చేతులెత్తేసే ప్రమాదముందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇకనైనా ఉపాధి హామీ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలన్నారు. ఈనెల10వ తేదీ నుండి 12వ తేదీ వరకు అనంతపురం నుండి బండ్లపల్లి వరకు జరిగే పాదయాత్రలో, బహిరంగ సభలో ప్రతి ఒక్కరు పాల్గొని బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కన్వీనర్ సునీల్, అరుణతేజ, శేషాద్రి, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

## తుమ్మచెట్ల వేలంపాట

గూడూరు మండల పరిధిలోని విందూరు గ్రామ సచివాలయం నందు డి.ఎల్.డి.వో వాణిరెడ్డి ఆధ్వర్యంలో విందూరు చెరువులోని నల్లతుమ్మ చెట్లను కొట్టుకొనేందుకు ఇటీవల బహిరంగ వేలం పాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 15 మంది వేలం పాటలో పాల్గొనగా, అద్దంకికి చెందిన శ్రీనివాసరావు నలభై నాలుగు లక్షల 80 వేల రూపా యలతో వేలం పాట పాడుకొని గెలుపొందారన్నారు.

# ‘జలధార-జలహారతి’ని పటిష్టంగా అమలుచేయాలి

జిల్లాలో నీటి వనరుల సమర్థ వినియోగం, భూగర్భ జలాల పెంపుదలకు ‘జలధార-జలహారతి-సాగునీటి సంఘాల బాధ్యత(జేజేఎస్ఎస్‌బీ) కార్యక్రమాన్ని’ సమర్థవంతంగా అమలుచేయాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. బుధవారం నెల్లూరు కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లాలోని వివిధ బేసిన్లు, ఉప బేసిన్లలో నీటి లభ్యతపై సమగ్ర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో భూగర్భజలాల స్థాయిని పెంచేందుకు సమగ్ర, స్థిరమైన చర్యలు తీసుకోవడం అవసరమన్నారు. దెబ్బతిన్న, లీకేజీ ఉన్న చెక్‌డ్యామ్‌లను పునరుద్ధరించడంతోపాటు, అనుకూల ప్రదేశాల్లో కొత్త సాగునీటి చెరువుల ఏర్పాటు సాధ్యతను పరిశీలించాలని ఆదేశించారు. చెరువుల కట్టలను బలోపేతం చేస్తూ పునరుద్ధరణ పనులు చేపట్టాలని, కాలువలలోని పూడికను తొలగించాలని, తూములు, కలుజుల మరమ్మత్తులు వేగవంతం చేయాలన్నారు. నెల్లూరు ఇరిగేషన్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

**మాతా శిశు మరణాలను నివారించాలి :**

జిల్లాలో మాతా శిశు మరణాలను పూర్తిగా నివారించేందుకు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. మాతా శిశు మరణాలపై కలెక్టర్ వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బందితో బుధవారం సమీక్షించారు. గర్భిణుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, కాన్పు పూర్తయ్యే వరకు కూడా తల్లి బిడ్డ ఆరోగ్యం పట్ల అత్యంత శ్రద్ధ కనబరచాలన్నారు. మారుమూల గ్రామాల్లో, ఎస్సీ ఎస్టీ ప్రజలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో మహిళల ఆరోగ్యంపై ప్రత్యేకదృష్టి పెట్టాలన్నారు. ఈ ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలను భర్తీ చేయాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ఉమామహేశ్వరి, డిసిహెచ్ఎస్ పరిమళ పాల్గొన్నారు.

• వైసీపీ నేతల డిమాండ్

# బీఆర్‌ని తొలగించాలి



విలేకరులతో మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

తిరుమల తిరుపతి దేవస్థానాల బోర్డు ఛైర్మెన్ బీఆర్ నాయుడును ఆ పదవి నుంచి తొలగించాలని వైసీపీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. బీఆర్ నాయుడి వ్యవహార శైలి బాగాలేదని ఆరోపిస్తూ వెంకటగిరి వైఎస్సార్సీపీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇటీవల వెంకటగిరి పట్టణంలో నిరసన చేపట్టారు. బీఆర్‌ని తొలగించాలని ప్రార్థిస్తూ, కలివేలమ్మ వీధిలోని వేంకటేశ్వర ఆలయంలో టెంకాయలు కొట్టి వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, వరుస ఆరోపణలు వస్తున్న బీఆర్ నాయుడును టీటీడీ ఛైర్మెన్‌గా ఎందుకు కొనసాగిస్తున్నారో స్వామివారి భక్తులకు అర్థం కావడం లేదన్నారు. ఆయనపై వివాదాస్పద వీడియోలు బయటకు వచ్చిన తర్వాత కూడా సీఎం చంద్రబాబు నాయుడు ఎందుకు ఉపేక్షిస్తున్నారని ప్రశ్నించారు. బీఆర్ నాయుడును టీటీడీ ఛైర్మెన్ పదవి నుంచి వెంటనే తొలగించి టీటీడీ పవిత్రతను కాపాడాలని ఆయన కోరారు.

## పర్వతరెడ్డి ఆధ్వర్యంలో నిరసనలు


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

టీటీడీ ఛైర్మెన్‌ని తొలగించాలంటూ వైసీపీ నాయకుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరు నగరంలో నిరసనలు వెల్లువెత్తాయి. బీఆర్ నాయుడు వెంటనే రాజీనామా చేయాలని వైసీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, వైసిపి మహిళా విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత తదితరులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పర్వతరెడ్డి మాట్లాడుతూ, భక్తుల మనోభావాలకు విరుద్ధంగా బీఆర్ వ్యవహరిస్తున్న తీరు విచారకరమన్నారు. ముఖ్యమంత్రి చొరవ తీసుకుని ఆయన్ను ఆ పదవి నుంచి తొలగించాలని ఆయన కోరారు.

# 26 నుంచి..నరసింహకొండపై బ్రహ్మోత్సవాలు

• ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలన్న ఆర్డీఓ అనూష


బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై సమీక్షిస్తున్న ఆర్డీఓ అనూష, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, అచ్యుత్‌రెడ్డి తదితరులు

నెల్లూరు రూరల్‌లోని నరసింహ కొండపై ఉన్న శ్రీ వేదగిరి లక్ష్మీ నరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 26వతేదీ నుండి మే 6వతేదీ వరకు అత్యంత వైభవంగా జరుగనున్నాయి. ఈ ఉత్సవాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొంటారు కనుక, వారికి ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చూడాలని రెవిన్యూ డివిజినల్ అధికారి అనూష అధికారులకు సూచించారు. ఇటీవల నరసింహకొండలోని సమావేశమందిరంలో స్వామివారి బ్రహ్మోత్సవాల నిర్వహణపై ఆయా శాఖల అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎండాకాలం దృష్ట్యా భక్తులకు వేసవి తాపం తగలకుండా చలువ పందిళ్ళు, మంచినీరు, ఓఆర్‌యస్ ప్యాకెట్లు, మజ్జిగ అందజేసేందుకు చర్యలు తీసుకోవాలాన్నారు. క్యూలైన్లు క్రమ పద్ధతిలో ఏర్పాటుచేసి, భక్తులకు త్వరిత గతిన దర్శనం కలిగేలా ఏర్పాటుచేయాలన్నారు. ఆలయ చైర్మన్ అచ్యుత శంకర్‌రెడ్డి మాట్లాడుతూ ఆలయ సిబ్బంది, ధర్మకర్తల మండలి సమన్వయంతో పనిచేసి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసేందుకు అందరూ కృషి చేయాలన్నారు. క్యూలైన్లు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లుచేయాలని చెప్పారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకుడు గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ దేవాదాయ శాఖ సిబ్బంది, ధర్మకర్తలు, సిబ్బంది పరస్పర సహకారంతో పనిచేయాలన్నారు. ఆలయ ఎగ్జిక్యూటివ్ కార్యనిర్వహణాధికారి గోపి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ‘తోలుబొమ్మలు’ నవల ఆవిష్కరణ


‘తోలుబొమ్మలు’ నవలని ఆవిష్కరిస్తున్న పొట్లూరి సుబ్రహ్మణ్యం, అవ్వారు శ్రీధర్‌బాబు తదితరులు

ప్రముఖ రచయిత చతుర్వేదుల చెంచు సుబ్బయ్యశర్మ రచించిన ‘తోలుబొమ్మలు’ నవలను ఈనెల 5న నెల్లూరులోని శ్రీ వేంకటేశ్వర విద్యాలయంలో ఆవిష్కరించారు. విశ్రాంత ఎమ్మార్వో.. ప్రముఖ కథా రచయిత పొట్లూరి సుబ్రహ్మణ్యం ఈ నవలను ఆవిష్కరించగా, పెన్నా రచయితల సంఘం అధ్యక్షులు అవ్వారు శ్రీధర్‌బాబు సభకు అధ్యక్షత వహించి, ఆ నవలని సమీక్షించారు కూడా. సమాజానికి ఎంతో ప్రయోజనం కలిగించే విషయాలెన్నో ఈ నవలలో ఉన్నాయని ఆయన అభినందించారు. ముఖ్యఅతిథిగా పూర్వ అడిషనల్ ఎస్పీ కొల్లూరు శ్రీనివాసులు పాల్గొని నవలా రచయితను అభినందించారు. పెరసం ప్రధాన కార్యదర్శి గోవిందరాజు సుభద్రాదేవి, గౌరవాధ్యక్షురాలు తోట సులోచన పాల్గొన్నారు. అనంతరం రచయితను సన్మానించారు. ఈ సందర్భంగా ‘యుద్ధం అనర్థం’ అనే అంశంపై నిర్వహించిన కవిసమ్మేళనంలో అనేక మంది కవులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో కవులు అన్నం శివకృష్ణ, హస్తి లక్ష్మణ్‌రాజు, పార్లపల్లి నాగేశ్వరి, దుప్పటి రమేష్‌బాబు, కూని అంకబాబు, మునీంద్ర, ప్రేమ్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.




• ఆత్మకూరులో జనసేన ర్యాలీ

# సిజెఎఫ్ఎస్ భూములకు పట్టాలు ఇవ్వాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఆత్మకూరు జనసేన ఇన్‌ఛార్జి నలిశెట్టి శ్రీధర్ తదితరులు

సిజెఎఫ్ఎస్ భూములకు వెంటనే పట్టాలు ఇవ్వాలంటూ ఆత్మకూరు నియోజకవర్గం జనసేన ఇన్‌చార్జి నలిశెట్టి శ్రీధర్ ఆధ్వర్యంలో ఇటీవల ఆత్మకూరులో ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ లోని అంబేద్కర్ విగ్రహం నుండి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ఆత్మకూరు ఆర్డీఓ బి.పావనికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ జనసేన పార్టీ అధిష్టానం పిలుపుమేరకు సిజెఎఫ్ఎస్ భూములను కోల్పోయిన రైతులకు సంఘీభావంగా ఈ ర్యాలీ నిర్వహించామన్నారు. సిజెఎఫ్ఎస్ భూములకు గతంలో కూటమి ప్రభుత్వంలోనే పట్టాలు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేయగా ఆ తర్వాత వచ్చిన వైయస్‌ఆర్‌సీపీ ఆ ప్రతిపాదనను తుంగలో తొక్కి సిజెఎఫ్ఎస్ పొలాల రైతులను ఇబ్బందులకు గురిచేసిందని, అందుకోసమే నెల్లూరుజిల్లా వ్యాప్తంగా 60,505 రైతు కుటుంబాలకు చెందిన 66,276 ఎకరాలకు సంబంధించిన రైతాంగ సమస్యపై ఆత్మకూరు ఆర్డీఓని కలిసి ఆ భూములకు పట్టాలు ఇవ్వవలసిందిగా తమ పార్టీ తరఫున విజ్ఞప్తి చేశామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు పి. సురేంద్ర, పార్టీ నేతలు గద్దం వంశీ, పాటి. రాఘవ, నాగరాజు యాదవ్, మదన్‌యాదవ్, మావిళ్ళ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# ఆహార పదార్థాల కల్తీలపై కొరడా! జాయింట్ కలెక్టర్



ప్రజల ఆరోగ్యం ప్రాధాన్యతగా కల్తీ మరియు నాణ్యత లేని ఆహార పదార్థాల విక్రయదారులపై, ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ఆ వివరాలను ఇటీవల జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు వెల్లడించారు. జిల్లాలో వివిధ రకాలైన నాణ్యత లేని ఆహార పదార్థాలను అమ్ముతున్న వ్యాపారులు, తయారీదారులు మరియు హోటల్స్‌వారిపై ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడులు చేసి వివిధ రకాలైన వ్యాపారస్తులపై నమోదు చేయబడిన వివిధ కేసులను విచారించి, ఐదుగురు వ్యాపారులకు లక్ష ఇరవైఐదు వేల రూపాయలు జరిమానా విధించినట్లు తెలిపారు. పలావు బియ్యం ప్యాకెట్‌పై లేబుల్ వివరాలు సరిగాలేని కారణంగా నలభైవేల రూపాయల జరిమానా విధించారన్నారు. అదేవిధంగా నగరంలోని డ్రై ఫ్రూట్ షాపును ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్లు తనిఖీ చేసిన సమయంలో, కాలం చెల్లిన డ్రై ఫ్రూట్స్ కనుగొన్న కేసులో షాపు యజమానికి 25 వేల రూపాయల జరిమానా విధించారన్నారు. నగరంలోని ఓ ఐస్ క్రీం తయారీ కేంద్రానికి, గొలగమూడిలోని ఓ రెస్టారెంట్ యజమానికి, నగరంలోని కొత్తూరులో ఓ ఫుడ్ సెంటర్ యజమానికి తగు జరిమానాలు విధించారని తెలిపారు. వ్యాపారాలను నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ నిర్వహించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ వారి లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలని, లేకుంటే పది లక్షల రూపాయలు వరకు జరిమానా తప్పదని ఆయన హెచ్చరించారు.

### 18 హోటళ్ళపై క్రిమినల్ కేసులు :

పలు హోటల్స్‌లో నిషేధిత రంగులను కలిపి మాంసాహార మరియు శాకాహార పదార్థాలను తయారుచేసి ప్రజలకు విక్రయించిన కేసులలో మొత్తం 18 హోటళ్లపై క్రిమినల్ కేసులు కూడా నమోదు చేయడం జరుగుతుందని జేసీ ఈ సందర్భంగా తెలిపారు. జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వెంకటేశ్వర్‌రావు, ఫుడ్ సేఫ్టీ అధికారులు ప్రణుతి ఫ్లోరా, నీరజ , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ విద్యుత్ కనెక్షన్లతో.. చెరువు నీళ్ళు తరలిస్తున్నారు

- అధికారులకు బీజేపీ నేత మిడతల ఫిర్యాదు

అక్రమ విద్యుత్ కనెక్షన్లతో.. కొందరు ముత్తుకూరు పెద్దచెరువు నీరు తరలించేస్తున్నారని, రోజుకు 250 ట్యాంకర్ల పోర్టుకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారని, ఆ జల దోపిడీని నిరోధించాలని జల వనరుల శాఖ పర్యవేక్షక ఇంజనీర్ దేశ్ నాయక్‌కు బీజేపీ నేత, నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ ఫిర్యాదు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉపముఖ్య మంత్రి ప్రతి నీటిచుక్కను కాపాడుకోవాలని చెప్తుంటే.. ముత్తుకూరులో మాత్రం 7.5 హెచ్‌పీ మోటర్లు బిగించి అక్రమంగా నీటిని తరలించుకుని వ్యాపారం చేసుకుంటున్నారని ఆరోపించారు. చట్ట వ్యతిరేకంగా జరుగుతున్న ఈ జలదోపిడిని నివారించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సునీల్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, హేమంత కుమార్‌రెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దేశ్‌నాయక్‌కి వినతిపత్రం సమర్పిస్తున్న మిడతల రమేష్

# భావితరాలకి దిక్సూచీ..నెల్లూరు జిల్లా స్వాతంత్ర్య సమర చరిత్ర!

ఎప్పుడో నాలుగు దశాబ్దాల క్రితం నెల్లూరులో జరిగిన ఓ సదస్సులో జిల్లా స్వాతంత్ర్యోద్యమం గురించిన అంశాలతో ఉపన్యాసాలు జరిగాయి. అప్పట్లో ఆ సదస్సుకు ప్రముఖ స్వాతంత్ర్యసమర యోధులు డా. బెజవాడ గోపాలరెడ్డి పాల్గొని, ఎంతో ముఖ్యమైన ఈ సదస్సులోని అంశాలను ఒక పుస్తకంగా వెలువరిస్తే బాగుంటుందని సూచించారు. అప్పటి నుంచి ఈ గ్రంథ నిర్వాహకులు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నా, అనేక కారణాంతరాల వల్ల బాగా జాప్యం జరిగి ఎట్టకేలకు ఇటీవల ఆవిష్కరణకు నోచుకుంది. జిల్లా స్వాతంత్ర్య సమరం గురించి, నాటి యోధుల గురించిన ఎన్నో ఆసక్తికర అంశాలను ఇందులో ప్రస్తావించారు. ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్ వ్యవస్థాపకులు డా. ఎం.పట్టాభిరామిరెడ్డి స్ఫూర్తితో, నెల్లూరులోని మల్లంపల్లి సోమశేఖరశర్మ చరిత్ర అధ్యయన కేంద్రం స్థాపకులు డా. వెంకటేశ్వరరావు సంపాదకత్వంలో, 1989లో ఆ సదస్సును నిర్వహించిన విఆర్‌సి చరిత్ర విభాగాధిపతి కాంజీవరం రాధాకృష్ణ తదితరుల ఆధ్వర్యంలో ఇన్నాళ్లకి ఈ గ్రంథం ఆవిష్కృతమైంది. 84అధ్యాయాలు గలిగిన ఈ గ్రంథం 470 పేజీలతో అలరారింది. అంతేగాక అనుబంధంగా ఆయా కాలాలకు సంబంధించిన ప్రాంతాలు, నాయకుల ఫోటోలను మరికొన్ని పేజీలలో అనుబంధంగా ఇచ్చారు. భవిష్యత్తులో చారిత్రక పరిశోధకులకు ఈ గ్రంథం ఒక దిక్సూచీ అని చెప్పవచ్చు. కావలిలో పుట్టి, నెల్లూరులో ఉద్యోగ జీవితం కొనసాగించిన డా. గిద్దలూరి వారు ఈ విధంగా నెల్లూరు ఋణం తీర్చుకున్నారనుకోవచ్చు. భారత స్వాతంత్ర్య సమరంలో చురుకుగా పాల్గొన్న జిల్లాల్లో నెల్లూరు కూడా ఒకటి. బెజవాడ గోపాలరెడ్డి, పొణకా కనకమ్మ, వెన్నెలకంటి రాఘవయ్య, ఒరుగంటి వెంకటసుబ్బయ్య తదితర మహామహులు ఎందరో ముందుండి జిల్లాలో స్వాతంత్ర్యోద్యమాన్ని ముందుకు నడిపించారు. నాటి చరిత్రను ఈ గ్రంథం మన కళ్లకు కట్టేవిధంగా వెలువరించడం అభినందనీయం.



సంపాదకులు:
**జి.వెంకటేశ్వరరావు**
వెల : రూ. 1,000/- పేజీలు : 470
ప్రతులకు: మల్లంపల్లి సోమశేఖరశర్మ చరిత్ర అధ్యయన కేంద్రం
చైతన్యపురి కాలనీ, ఎ.కె.నగర్, నెల్లూరు-4. సెల్: 94914 57496

ఈ గ్రంథం మొదటి అధ్యాయంలో నెల్లూరుజిల్లా చారిత్రక ప్రాధాన్యతను తెలియజేశారు. ఈ వ్యాసానికి ఆంగ్ల మూలం డా. మలిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, అనువాదం డా. భట్టిప్రోలు కామేశ్వరరావు. ఆ వ్యాసం నెల్లూరు జిల్లా ప్రాచీనత్వాన్ని తెలియజేస్తూ అబ్బురపరుస్తోంది. అదేవిధంగా, ఆంధ్రప్రదేశ్‌లో స్వాతంత్ర్యోద్యమం సాగిన తీరును గొట్టిపాటి సుజాత, 'నెల్లూరు జిల్లాలో భారత స్వాతంత్ర్యోద్యమం' గురించి ఒరుగంటి వేంకట సుబ్బయ్య వ్యాసాలు బాగా వివరించాయి. 'నెల్లూరుజిల్లా స్వాతంత్ర్యోద్యమంలో మహిళల పాత్ర'పై కె.సునీత రాసిన వ్యాసం అబలలు సబలలు అన్న విషయాన్ని ఋజువు చేస్తుంది. అలాగే యం.మాధవరావు రాసిన 'క్విట్ ఇండియా ఉద్యమం', యస్.వి.రమణయ్య రచించిన 'ఒరుగంటి వెంకటసుబ్బయ్య' వ్యాసం ఒరుగంటి వారిలో త్యాగ గుణాన్ని గురించి సోదాహరణంగా తెలుపుతుంది. డా. వి.లలిత వ్యాసం 'వెన్నెలకంటి' రాఘవయ్య పోరాటాన్ని, ప్రత్యేకించి ఆదివాసీల కొరకు వారు చేసిన సేవలను విశదపరుస్తుంది. డా. టి.వసుంధర పొట్టి శ్రీరాములు గారి 'గాంధేయవాదిత్వాన్ని' తన వ్యాసంలో సవివరంగా తెలియజేస్తుంది. రావిప్రోలు రామమూర్తి వ్యాసం 'దిగుమర్తి' హనుమంతరావు పల్లిపాడులో గాంధీ ఆశ్రమాన్ని స్థాపించడానికి పడ్డ శ్రమను తెలియజేస్తుంది. 'నెల్లూరుజిల్లాలో మహాత్మా గాంధీ పర్యటనలు' వివరాలు తెలియజేస్తూ గూడూరు లక్ష్మి, ప్రముఖ స్వాతంత్ర్యయోధులు నాగసూరు వీరరాఘవయ్య, పైడా సుబ్బరామయ్యల పోరాట చరిత్ర గురించి బొగ్గరపు రాధాకృష్ణమూర్తి తదితరులు రాసిన వ్యాసాలు ఎంతో స్ఫూర్తిని కలిగించే విధంగా ఉన్నాయి. అలాగే వేద సంస్కృత పాఠశాల చరిత్ర, గోదపత్రిక, నెల్లూరుజిల్లాలోని వివిధ సమాజములు - సేవలు, స్వాతంత్ర్య సమర యోధుల పేర్ల జాబితా - వారి త్యాగాలు... ఇలా ఒకటేమిటి? ఎన్నో చారిత్రక విషయాలను ఈ గ్రంథం పాఠకుల ముందుంచుతుంది. పాఠకులను దేశభక్తి పట్ల ప్రభావితం చేస్తుంది. పార్ట్-బిలో తిరుగుబాటు ఉద్యమాలు, స్వాతంత్ర్యోద్యమానికి సంబంధించిన పాటలు, పేద ప్రజలకు సేవలందించిన అమెరికన్ బాప్టిస్ట్ మిషనరీ హాస్పిటల్ వారి సేవలు... మొదలైన ఎన్నో చారిత్రక విషయాలను పొందు పరిచారు. నాటి జిల్లా చరిత్రను తెలుసుకోగోరే వారికి, భావితరాల వారికి ఈ గ్రంథం మరింత ఉపకరిస్తుంది కూడా!..



**డా. గంగిశెట్టి శివకుమార్**
సెల్ : 94418 95343

## టూకీగా...



### కావలి మునిసిపాలిటీ వద్ద నిరసనలు

కావలి మునిసిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలంటూ ఈనెల 7న మునిసిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మునిసిపల్ కార్యాలయం వద్ద నిరసనలు తెలియజేశారు. ఏఐటియుసిరాష్ట్ర కార్యవర్గ సభ్యులు దామా అంకయ్య, సీపీఐ నాయకులు నరసింహారావు, కొప్పర్తి నాగరాజు, ఏఐటియుసి నాయకులు రవి పాల్గొన్నారు.

### రాపూరు ఆరోగ్యకేంద్రం పరిశీలన

రాపూరులోని సామాజిక ఆరోగ్యకేంద్రాన్ని ఈనెల 7న అడిషనల్ డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ ఖాదర్‌వలీ పరిశీలించారు. క్షయవ్యాధిగ్రస్తులకి సంబంధించిన రికార్డులను పరిశీలించి, టీబీ ముక్త్‌భారత్ అభియాన్ కార్యక్రమాన్ని ఆరోగ్య సిబ్బంది విజయవంతంగా అమలుచేయాలన్నారు. క్షయవ్యాధి నిర్మూలనకు అందరూ కలసి కృషిచేయాలని సిబ్బందికి చెప్పారు.

### కోటలో సాగునీటి సంఘాల వారితో సమావేశం

కోటలో ఈనెల 7న సాగునీటిసంఘాల ప్రతినిధులతో ఎంపీడీఓ దిలీప్‌కుమార్ సమావేశమై, భూగర్భ జలాల సంరక్షణపై అవగాహన కలిగించారు. ప్రజల భాగస్వామ్యంతో నీటిసంరక్షణ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. నీటిపారుదల ఏఇ మునిరత్నం, వ్యవసాయాధికారి సురేంద్రప్రసాద్, ఏఇ అరవింద్, జలసంఘం అధ్యక్షుడు వెంకటరమణయ్య, రైతులు పాల్గొన్నారు.

### ఇనమడుగులో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

కోవూరు మండలం ఇనమడుగు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఈనెల 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. వైద్యాధికారి సిహెచ్ నిరంజన్, వైద్యులు డాక్టర్ ఇర్ఫాన్, సీహెచ్ఓ ఎస్.ప్రభావతి, పీహెచ్ఎన్ కృష్ణమ్మ తదితరుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, ఆరోగ్య సంరక్షణ పట్ల ప్రజలకు అవగాహన కలిగించారు.

### సంగంలో గురుకుల విద్యార్థినికి పాము కాటు

సంగంలోని గురుకుల పాఠశాలలో చదువుతున్న 5వ తరగతి విద్యార్థిని అనూష ఇటీవల పాము కాటుకు గురైంది. చీకటిలో వస్తుండగా పాము కరవడంతో, తల్లితండ్రులు సమాచారం అందుకుని, వెంటనే ఆ బాలికను ఆత్మకూరు వైద్యశాలకి తరలించి చికిత్స చేయిస్తున్నారు. అదృష్టవశాత్తూ ఆ బాలికకు ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు.

### తోపుగుంట వద్ద రోడ్డుప్రమాదం.. ఒకరి మృతి

కలువాయి మండలం తోపుగుంట వద్ద ఈనెల 7న జరిగిన రోడ్డుప్రమాదంలో స్కూల్ వ్యాను ఢీకొని, బైక్‌పై వెళ్తున్న ఇద్దరికి తీవ్రగాయాలు కాగా ఓ వ్యక్తి మరణించాడు. మృతుడు అనంతసాగరం మండలం పడమటికంభంపాడుకు చెందిన వారుగా గుర్తించారు. కలువాయి ఎస్ఐ కోటయ్య ఆధ్వర్యంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### సౌత్‌మోపూరులో చేనేతకారులకు అవగాహన

నెల్లూరు రూరల్ మండలం సౌత్‌మోపూరులో ఇటీవల చేనేత జౌళిశాఖ ఏ.డి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో చేనేతకారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అర్హులైన వారంతా ఉచిత విద్యుత్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చేనేత నాయకుడు పముజుల దశరథరామయ్య, రూరల్ మండల అధ్యక్షులు ప్రదీప్, హరి, తదితరులు పాల్గొన్నారు.

### ఆత్మకూరులో ప్రైవేట్‌ట్రావెల్స్ బస్సుల తనిఖీ

ఆత్మకూరులో ఇటీవల పలు ప్రైవేట్‌ట్రావెల్స్ బస్సులను ఆత్మకూరు సీఐ గంగాధర్, మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ రాములు, అగ్నిమాపక అధికారి రమణయ్య తనిఖీ చేశారు. ఆ బస్సుల్లో భద్రతా ప్రమాణాలను పరిశీలించి, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు.

### కృష్ణపట్నంలో చండీయాగం


ముత్తుకూరు మండలం కృష్ణపట్నం గ్రామదేవత మొలక పోలేరమ్మ జాతర సందర్భంగా ఈనెల 7న ఆలయంలో యాజ్ఞికులు సుబ్బయ్య శాస్త్రి, ఆగమ సలహాదారు రామనాథశర్మల నేతృత్వంలో చండీయాగం వైభవంగా నిర్వహించారు. అనంతరం, భక్తులకు అన్నదానం చేశారు.

## కోటంరెడ్డి సోదరుల ఆధ్వర్యంలో..
# 'సూర్యఘర్'కి శంకుస్థాపన


సూర్యఘర్ పథకానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని పెనుబర్తి గ్రామం చెర్లో ఎస్‌టీ సంఘంలో ఈనెల 8న ప్రధానమంత్రి సూర్యఘర్ పథకానికి కోటంరెడ్డి సోదరులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రధానమంత్రి సూర్యఘర్ పథకానికి అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో దాదాపుగా 3 వేల మందికి 36 కోట్ల రూపాయల నిధులతో ప్రధానమంత్రి సూర్యఘర్ పథకానికి శ్రీకారం చుట్టామన్నారు. పెనుబర్తి, కలివెలపాలెం, మాదరాజుగూడూరు, కాకుపల్లి గ్రామాల ప్రజలకు ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే ఆ సమస్యలను పరిష్కరించేందుకు శాసనసభ్యుడిగా తాను ఎల్లవేళలా సిద్ధంగా ఉంటానని శ్రీధర్‌రెడ్డి చెప్పారు. రూరల్‌లో 3 ఫేజ్ కరెంటు పనులు 100 శాతం పూర్తిచేసి నెల్లూరుజిల్లాలోనే నెల్లూరు రూరల్ ప్రథమస్థానంలో ఉందన్నారు.

# ఆరోగ్యం పట్ల అప్రమత్తత అవసరం
## అపోలో హాస్పిటల్స్ ఛైర్మెన్ డాక్టర్ ప్రతాప్ సి. రెడ్డి



దేశం యొక్క నిజమైన శక్తి దేశ ప్రజల ఆరోగ్యంపై ఆధారపడి ఉంటుందని, ఆరోగ్యం పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అపోలో హాస్పిటల్స్ వ్యవస్థాపక ఛైర్మెన్ డాక్టర్ ప్రతాప్ సి. రెడ్డి చెప్పారు. ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలు అందించడం ద్వారా అపోలో హాస్పిటల్స్ దేశ సేవలో ముందుకు సాగుతోందని తెలిపారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 7న డాక్టర్ ప్రతాప్ సి. రెడ్డి తన సందేశాన్ని తెలియ జేస్తూ, 'హెల్త్ ఆఫ్ ది నేషన్–2026' పేరుతో నివేదికను విడుదల చేశారు. దేశంలో మారుతున్న ఆరోగ్య మార్పులను తెలియజేశారు. గతంలో వృద్ధాప్యంలో వచ్చే మధుమేహం, గుండెపోటు లాంటి వ్యాధులు నేడు 20 నుండి 30ఏళ్ల వయసు వారిలోనూ కనిపిస్తున్నాయని, వ్యాధి లక్ష ణాలు బయటపడకముందే శరీరం లోపల ఆ వ్యాధి తాలూకు అనారోగ్యం ముదిరి, పరిస్థితి విషమించేవరకూ వస్తోందన్నారు. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోకపోవడం, ప్రాణాంతక వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించలేకపోవడమే దీనికి కారణమన్నారు. క్యాన్సర్, కిడ్నీ సమస్యలు, ఊబకాయం వంటివి దేశంలో "సైలెంట్ కిల్లర్స్"లా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

### పెరుగుతున్న వ్యాధులు :

రాష్ట్రంలో 27.0శాతం మంది మధుమేహంతో బాధపడుతున్నారని, 22.5శాతం మంది అధిక రక్తపోటుతోను, 4.2శాతం మంది రక్తహీనతతోను, 81.8శాతం మంది ఊబకాయంతో, మరో 56.7శాతం మంది డిస్లిపిడెమియా.. అంటే రక్తంలో అధికంగా కొవ్వు ఉన్న సమస్యలతో బాధపడుతున్నట్లు తెలియజే శారు. నెల్లూరు నగరానికి సంబంధించి పరీక్ష చేయించుకున్న వారిలో 27.6 శాతం మందికి మధుమేహం ఉందని, 29.2 శాతం మంది అధిక రక్తపోటుతో బాధపడుతున్నారని, 21.3 శాతం మందిలో రక్తహీనత ఉన్నట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. నెల్లూరులో 85.3 శాతం మంది అధిక బరువు లేదా ఊబకాయంతో బాధపడుతున్నారని, అత్యధికంగా 73.8శాతం మందిలో కొలెస్ట్రాల్ లేదా లిపిడ్ స్థాయిలు అసాధారణంగా ఉన్నట్లు తేలిందని ఆయన వివరించారు.

# మత్స్యకారుల సంక్షేమమే ధ్యేయం



- రాజ్యసభలో బీఎంఆర్

మత్స్యకారుల సంక్షేమం, మత్స్య పరిశ్రమ సమగ్ర అభివృద్ధి కోసం రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు యాదవ్(బీఎంఆర్) 'నేషనల్ కమిషన్ ఫర్ ఫిషర్ మెన్(వెల్ఫేర్ అండ్ సపోర్ట్) బిల్, 2025'ను ప్రవేశపెట్టేందుకు ఈనెల 8న రాజ్యసభలో అనుమతి కోరారు. ఆ బిల్లుతో దేశ వ్యాప్తంగా మత్స్యకారులు, చేపల సాగుదారులు, మత్స్య కార్మికులు మరియు సంబంధిత వర్గాల సంక్షేమాన్ని కేంద్రంగా ఉంచి జాతీయ స్థాయి కమిషన్ ఏర్పాటు ప్రతిపాదించారు. ఈ కమిషన్ కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలు, పరిశ్రమలు, మత్స్యకార సంఘాల మధ్య సమన్వయ వేదికగా పనిచేస్తూ ఉత్పత్తి పెంపు, న్యాయమైన ధరలు, ఎగుమతుల విస్తరణ, నాణ్యత ప్రమాణాలు, ఫుడ్ సేఫ్టీ వంటి అంశాలపై దృష్టి సారిస్తుంది. చిన్న మత్స్యకారులకు సాంకేతిక మద్దతు, నైపుణ్యాభివృద్ధి, శిక్షణ, ఉపాధి భద్రత కల్పించేందుకు విధాన సూచనలు చేస్తుంది. ప్రతి రెండేళ్లకు దేశవ్యాప్తంగా సామాజిక, ఆర్థిక సర్వే నిర్వహించి ప్రభుత్వానికి సూచనలు అందిస్తుంది. అదేవిధంగా "ఫిషరీస్ ప్రొమోషన్ అండ్ డెవలప్‌మెంట్ ఫండ్" ద్వారా సంక్షేమ కార్యక్రమాలు, పరిశోధన, మౌలిక వసతులు, మార్కెటింగ్‌కు మద్దతు అందించనున్నారు.

# నాపై నమ్మకం ఉంచండి..మీ సమస్య తీరుస్తా!
- మత్స్యకారులకు కలెక్టర్ భరోసా


162 గ్రామాల మత్స్యకారుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, ఎస్పీ అజిత

తాను కలెక్టర్ కాకముందు ఆరేళ్లపాటు 70 దేశాల్లో సముద్రంలో పనిచేసిన అనుభవంతో మత్స్యకారుల సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందని, జిల్లాలో గత 20 ఏళ్లుగా కొనసాగుతున్న సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించడమే తన లక్ష్యమని జిల్లా కలెక్టర్ చెప్పారు. 'నాపై నమ్మకం ఉంచండి – మీ సమస్య తీరుస్తా' నంటూ ఆయన మత్స్యకారులకు భరోసా ఇచ్చారు. ప్రభుత్వం పక్షాన అన్ని విధాల తోడుగా ఉంటానని చెప్పారు. భవిష్యత్తులో తీరప్రాంతాల్లో ఏర్పడే పరిశ్రమల ద్వారా మత్స్యకార యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, వారి విద్యకు కూడా సహక రిస్తామని హామీ ఇచ్చారు. ఈనెల 9వ తేదీ గురువారం నెల్లూరు టౌన్‌హాల్లో తిరుపతి, నెల్లూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాలకు చెందిన 162 గ్రామాల మత్స్య కార కాపులు, మత్స్యకారులతో కలెక్టర్ హిమాన్షు శుక్ల, ఎస్పీ డా. అజిత వేజండ్ల ముఖాముఖీ సమావేశం నిర్వహించారు. తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాల మత్స్య కారుల అక్రమ వేట సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కలెక్టర్ తెలిపారు. అందుకు అవసరమైన బోట్లను కూడా సిద్ధం చేస్తోం దన్నారు. జిల్లా ఎస్పీ డా. అజిత వేజండ్ల మాట్లాడుతూ, తమిళనాడు బోట్ల అక్రమ వేటకు సంబంధించి చేపట్టాల్సిన చర్యలపై ఒక ప్రత్యేక కమిటీని నియమించుకునేందుకు మత్స్యకారులు ముందుకు రావాలని సూచించారు. ఎస్‌పి సౌజన్య, డిఎఫ్‌వో మహబూబ్‌బాషా, డిఆర్‌వో విజయ్‌కుమార్, మత్స్యశాఖ జేడీ డా. శాంతి పాల్గొన్నారు.

## మంత్రి నారాయణ సేవలతో..
# పేదలకు ఆరోగ్య భరోసా


నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యులు

ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా నెల్లూరులోని 54వ డివిజన్ భగత్‌సింగ్ కాలనీలో ఆరోగ్య కార్యక్రమాలు నిర్వహిం చారు. ఇటీవల మంత్రి నారాయణ చేపట్టిన 'ప్రతి గడపకు ఆరోగ్య భరోసా'లో భాగంగా, వైద్య బృందాలు మరియు నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ఆరోగ్య అవగాహన కరపత్రాలను పంపిణీ చేశారు. ఆపదలో అండగా ఉంటూ, పేదలకు ఉచిత వైద్యం అందిస్తూ మంత్రి నారాయణ చేస్తున్న సేవలను వారు ప్రజలకు తెలియజేశారు. నారాయణ నేత్రజ్యోతి మరియు నారాయణ దంత సురక్ష కార్యక్రమాల ద్వారా ఇప్పటివరకు మొత్తం 2,986 మందికి కంటి పరీక్షలు, 1,556 మందికి ఉచితంగా కంటి అద్దాల పంపిణీ, 45 మందికి అత్యంత ఖరీదైన కంటి శస్త్రచికిత్సలు మరియు 1,600 మందికిపైగా దంత చికిత్సలను పూర్తి ఉచితంగా అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. నారాయణ హాస్పిటల్ అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ హరీష్, ఆప్తాల్మాలజీ ప్రొఫెసర్ డాక్టర్ సుధ పాల్గొన్నారు.


సభలో పాల్గొన్న ప్రముఖ కవులు, రచయితలు

# 'అరసం'.. కొత్త కార్యవర్గం

'అభ్యుదయ రచయితల సంఘం' (అరసం) నెల్లూరుజిల్లా శాఖ తొలి జిల్లా మహిళా సభ ఈ నెల 9వ తేదీ గురువారం నెల్లూరులోని డికెడబ్ల్యూ కాలేజీలో జరిగింది. జిల్లా ప్రధాన కార్యదర్శి డా. కె.కరుణశ్రీ సభను స్వాగతించారు. ప్రసిద్ధ నవలా రచయిత డా. వి.ఆర్.రాసాని (తిరుపతి), ప్రముఖ రచయిత్రి వి.ప్రతిమ, వల్లూరు శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అరసం జిల్లా శాఖకు కొత్త కార్యవర్గాన్ని ప్రకటిం చారు. గౌరవాధ్యక్షుడిగా డా. పెరుగు రామకృష్ణ, అధ్యక్షునిగా డా. గంగిశెట్టి శివకుమార్, ఉపాధ్యక్షులుగా టి.వి.రామకృష్ణ, డా. వై.శాలజ, ప్రధాన కార్యదర్శిగా డా.కె.కరుణశ్రీ, కార్యనిర్వా హక కార్యదర్శిగా అవ్వారు శ్రీధర్‌బాబు ఎంపికయ్యారు. అదే విధంగా సంయుక్త కార్యదర్శులుగా డా. పద్మప్రియ, రామాపురం శ్రీనివాసులు, కోశాధి కారిగా అన్నం శివకృష్ణ, కార్యవర్గ సభ్యు లుగా కూని అంకబాబు, వై.మునీంద్ర, జి.సాయిచంద్రశేఖర్, ఏ.వెంకటసుధీర్, ప్రదీప్‌లను ఎన్నుకున్నారు.

## జనసేన సభ్యత్వాలకు..
# మంచి స్పందన


సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న గునుకుల కిషోర్, విజయలక్ష్మి

నెల్లూరు, సంతపేట ప్రాంతంలో జనసేన పార్టీ ఇటీవల చేపట్టిన ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమానికి మహిళల నుంచి విశేష స్పందన లభించింది. జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు గునుకుల కిషోర్ మరియు వీర మహిళ, ఏఎంసి డైరెక్టర్ గునుకుల విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు ఉద్యమి సభ్యత్వం ప్రాముఖ్యతను వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 20లక్షల సంఖ్యలో సభ్యత్వాలు నమోదవు తుండగా, జిల్లాలో కూడా 70వేలు దాటి భారీ స్థాయిలో స్పందన లభిస్తోందని వారు తెలిపారు. స్థానిక సమస్యల పరిష్కారంలో జనసేన ఉద్య మిలు ముందుండాలని, ప్రజల హక్కుల సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు. బ్లూబర్డ్ సంస్థ అధినేత వేముల శివ, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com